J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 52 28.5.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## నవ్యాంధ్రలో

# న(యు)వ పాలనకు రెండేళ్ళు

## » సక్సెస్ క్రెడిట్ అంతా ముఖ్యమంత్రి జగన్‌దే!



ఆంధ్రా ముఖ్యమంత్రి వై. యస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు మే 30వ తేదీన రెండవ పుట్టిన రోజు. జగన్‌గా పదేళ్ల పాటు నిత్యం ప్రజలలోనే ఉంటూ "దమ్మున్న నాయకుడి"గా ఆంధ్రుల అభిమానాన్ని దోచుకున్నారు. సీయంగా "సత్తా వున్న పాలకుడి"గా సామాన్యుడి మనస్సులో కొలువైపోయారు.

- వైసీపీని గడప గడపకూ తీసుకెళ్లిన యువ ముఖ్యమంత్రి
- రెండేళ్లు గడచినా చెక్కుచెదరని ప్రజాభిమానం
- మంత్రులకు 30 నెలల గండం దగ్గర పడుతోంది

అటు రాజకీయాలకు, ఇటు పరిపాలనకు కొత్త వాళ్ళైన 90 శాతం మందిని తన చుట్టూ పెట్టుకుని జగన్‌మోహన్‌రెడ్డి తన రెండేళ్ల పాలనను సమర్ధవంతంగా పూర్తి చేసుకున్నారు. ముఖ్యమంత్రితో సహా 90శాతం మంది పరిపాలనకు కొత్తవాళ్ళే అయినా సక్సెస్ మార్కులన్నీ తన ఖాతాలోనే వేసుకున్నారు జగన్. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఇప్పటకీ ప్రజలలో అదే ఆదరణ ఉందంటే అందుకు కారణం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డే అన్న మాట ప్రజల్లో బలంగా వినపడుతోంది.

కష్టకాలంలో తన వెంట నడచిన వారిని ముందుగా గుర్తించారు జగన్. విధేయతకు, విశ్వసనీయతకు పెద్దపీట వేసి అనుభవం కన్నా అనుబంధమే గొప్పదన్న సూత్రాన్ని పాటించి కార్పొరేటర్ స్థాయికి తక్కువ, శాసన సభ్యత్వానికి ఎక్కువ అయిన

11లో

## రాజకీయ చట్రంలో..

# ఆనందయ్య మందు

## ప్రజలది సెంటిమెంటు! నేతలది పొలిటికల్ స్టంటు!!

ఇప్పుడు ప్రపంచమంతా భారత దేశం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలో గల కృష్ణపట్నం గ్రామం వైపు చూస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన నౌకా కేంద్రం కలిగిన ప్రాంతంగా ప్రపంచ పటంలోకి ఎక్కిన కృష్ణపట్నం, ప్రస్తుతం కరోనా కోసం ప్రకృతి వైద్యం కనుక్కున్న ప్రాంతంగా అంతర్జాతీయ ఆరోగ్య రంగాన్ని ఆకర్షిస్తోంది. ఆనందయ్య అనే ఒక సామాన్య పల్లెటూరు రైతు తయారు చేస్తున్న నాటు మందు లభించే ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది.

ప్రకృతిలో లభించే సహజసిద్ధమైన ఆకులతో పాటు మనం నిత్యం వంటింట్లో వాడే అనేక దినుసులతో ఈ మందు తయారు చేస్తున్నట్లు ఆనందయ్య చెప్తున్నారు. యావత్ సమాజం ఇప్పుడు ఆనందయ్య మందు వైపు చూస్తుంటే, మన రాజకీయ నాయకులు మాత్రం ఇక్కడా వదలకుండా రాజకీయాలు చేస్తున్నారు. అధికారపార్టీతో సహా అన్ని రాజకీయపార్టీలు ఈ అంశంలో రాజకీయాలను చూస్తున్నారు. అన్ని పార్టీల వాళ్ళూ ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు ప్రకటనలు చేస్తూ ఆనందయ్య మందుకి రాజకీయ మలినం అంటిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ అధీనంలో నడిచే 'ఆయుష్' లాంటి సంస్థలు ఈ మందుకి చట్ట బద్ధత లేకపోయినా ప్రమాదం మాత్రం లేదని చేప్పేశాయి. ఆనందయ్య మందు వాడినందువల్ల ఎలాంటి నష్టం లేదని తేల్చిపారేశాయి. ఇలాంటి సమయంలో ప్రజల సెంటిమెంట్లను గౌరవించవలసిన

11లో

### కరోనా కట్టడిలో...

## సంచలనం సృష్టిస్తున్న నెల్లూరోళ్ళు



ఒకరిది
శాస్త్ర పరిజ్ఞానం
ఇంకొకరిది
శాస్త్రీయ విధానం



12లో




# లక్ష్మీనృసింహునికి.. బంగారు గరుడసేవ



నెల్లూరు సమీపంలోని వేదగిరిపై వెలసిన శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఈనెల 24న స్వామి వారికి అత్యంత వైభవంగా బంగారు గరుడసేవ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా స్వామి వారికి కనువిందుగా పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత అఖండజ్యోతి, మోహిని ఉత్సవం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి అమ్మవారికి వేడుకగా పూలంగిసేవ చేశారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

## కన్నులపండువగా..

# కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు




నాయుడుపేట మండలంలోని తుమ్మూరులో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23వ తేదిన ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. టిటిడి అధికారుల ఆధ్వర్యంలో కన్నులపండువగా జరుగుతున్న ఈ వేడుకలను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అధికారులు పర్యవేక్షిస్తుండగా, ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ధ్వజారోహణం సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. టిటిడి డెప్యూటీ ఇ.ఓ రాజేంద్రుడుతో పాటు ఆలయ ఇన్స్‌పెక్టర్ కామరాజు, ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, కిషన్‌స్వామి, టిటిడి వేదపండితులతో పాటు కరిమాణిక్యస్వామి భక్తబృందం, గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఈనెల 23 నుంచి జూన్ 1వతేది దాకా జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23వ తేది సాయంత్రం శేషవాహనసేవ, 24న చప్పరం, హనుమంత సేవ, 25న ద్వార దర్శనం, గరుడసేవ, 26న చప్పరం, హంసవాహన సేవలు ఎంతో ఘనంగా జరిగాయి. 27న చప్పర ఉత్సవం, విమానోత్సవం, 28న చప్పరం, మోహిని ఉత్సవం, రాత్రికి కల్యాణోత్సవం, 29న రథోత్సవం, తిరుచ్చి ఉత్సవం, 30న చప్పరం, పారువేట ఉత్సవం, 31న వసంతోత్సవం జరుగనున్నాయి. అనంతరం బ్రహ్మోత్సవాల ముగింపు సూచకంగా ధ్వజ అవరోహణోత్సవం చేస్తారు. జూన్ 1న స్వామివారికి, అమ్మవార్లకు పుష్పాభిషేకం చేసి ఏకాంతసేవ నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

## జొన్నవాడ బ్రహ్మోత్సవాలకు..

# శాస్త్రోక్తంగా స్తంభ ప్రతిష్ఠ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో జూన్ 1 నుంచి 11వ తేది వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 24న ఆలయంలో అర్చకులు శాస్త్రోక్తంగా స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, ప్రమీలమ్మ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# వంకి పెంచలయ్యకు పితృవియోగం



గూడూరులోని ఆదిశంకర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ వంకి పెంచలయ్య తండ్రి వంకి ఆదిశేషయ్య నెల్లూరులో ఈనెల 25వ తేదిన అనారోగ్యంతో మృతి చెందారు. ఆది శంకర విద్యాసంస్థల అభివృద్ధికి ఆయన ఎనలేని కృషిచేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఆయన చేసిన కృషి అపారం. వేలాదిమంది విద్యార్థులు ఈ విద్యాసంస్థల్లో చదువుకుని సమాజంలో ఉన్నతమైన స్థానాల్లో రాణిస్తున్నారు కూడా. ఆయన మృతికి జిల్లాలోని అనేక విద్యాసంస్థల వారు, ప్రముఖులు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది అందరూ విచారం వ్యక్తం చేస్తూ ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

# స్మైల్ వాకర్స్ మెడికల్ కిట్లు

నెల్లూరులోని స్మైల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భక్తవత్సలరెడ్డి, సభ్యుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 24న కరోనా బాధితుల కోసం నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 50 మెడికల్ కిట్లను అందజేశారు. వాటిని హోం ఐసోలేషన్లలో ఉన్న బాధితులకు అందజేస్తామని తహశీల్దార్ లావణ్య, వైద్యాధికారి సురేంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనూష, రమాకుమారి, శివప్రసాద్, ప్రియాంక్, ఏఎస్ఐ వెంకటనాగరాజు, హౌసింగ్ ఇఇ మాధవరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకు

# తృటిలో తప్పిన ప్రమాదం

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఈనెల 24న జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమయ్యే ఆయనను ఆ దేవుడే కాపాడాడు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన కారులో వెళ్తుండగా కోవూరు సమీపంలోని పడుగుపాడు వద్ద లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అయితే కారులో ఉన్న ఎమ్మెల్యే ప్రసన్నకు గానీ, ఆయనతో పాటు ఉన్న విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిఏఏబి ఛైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబు రెడ్డిలకు గానీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో 'అంతా ఆ దేవుడి దయ' అంటూ... ప్రసన్న అభిమానులు, వైకాపా కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు.

## జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి..

# వెంకటశేషయ్య కన్నుమూత

జిల్లా వృత్తి విద్యాశాఖ (ఎఫ్ఏసి) అధికారి వి.వెంకటశేషయ్య కోవిడ్‌తో ఈనెల 25న కన్నుమూశారు. ఆయన మృతికి ఏపి ఉన్నత విద్యాశాఖ బోధనేతర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ నిమ్మల సుబ్బయ్యగౌడ్, డివిఇఓ కార్యాలయం సిబ్బంది శారద, శ్రీకాంత్, భాస్కర్, పద్మ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేస్తూ.. ఆయన కుటుంబసభ్యులకు తమ సంతాపం ప్రకటించారు.

# వేయి పువ్వులు వికసించనీ



- చిన్ని నారాయణరావు
94402 02942

భూమి భస్మీపటలమై
బద్దలవుతున్న ప్రళయం
అగ్గిలేకుండానే కాలుతున్న
శవాల కమురు వాసన
ఇదో విషమ పరీక్షా సమయం
ఊళ్ళకు ఊళ్ళే తగలబడ్తున్న
నిర్మానుష్యం
ఎటుచూసినా జీవచ్ఛవాలు
ఖాళీ అయిపోతున్న వాకిళ్ళు
ఎన్ని పుస్తెలు తెగి నేలరాలి
పోయాయో కదా
ఎన్ని కన్న కడుపులు కడుపు తీపితో
ఆక్రోశిస్తున్నాయో కదా
ఇక నిర్వేదం వద్దు తమ్ముడూ
వేయిపువ్వులు
వికసించే వేళయ్యింది
అమృతం తాగి అనిమిషులమయ్యే
సమయమయింది
'ఆనంద' మార్గాన
కరోనాను జయిద్దాం
క్రేజీ ఓషధిని తాగి
కరోనాను ఓడిద్దాం
రేపటి వెలుగులకు
భాగస్వాములవుదాం!

# 32 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి



నెల్లూరు నగర నియోజకవర్గానికి చెందిన 32 మందికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ సహకారంతో రూ.32.05 లక్షల చెక్కులను అందించినట్టు వైకాపా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్ తెలిపారు. మంగళవారం నెల్లూరులోని రాజన్న భవన్‌లో లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం సరిగా లేనందున 32 మంది మంత్రి అనిల్‌కుమార్‌ను కలిసి ముఖ్యమంత్రి సహాయనిధి ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే స్పందించి నిధులను విడుదల చేయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఇంతియాజ్, ఖలీల్‌అహ్మద్, కాయల సురేష్‌బాబు, నతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 'నాడు-నేడు'తో బడులకు కొత్త వెలుగులు

## విద్యాశాఖ సంచాలకులు వాడ్రేవు చినవీరభద్రుడు

ప్రభుత్వం చేపట్టిన 'నాడు-నేడు' పనులతో పాఠశాలలకు అన్ని వసతులు చక్కగా ఏర్పాటవుతున్నాయని విద్యాశాఖ సంచాలకులు వాడ్రేవు చినవీరభద్రుడు అన్నారు. ఇటీవల ఆయన కలువాయి మండలంలోని నూకనపల్లి మెయిన్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఎస్సి పాఠశాలలను సందర్శించి అక్కడ జరుగుతున్న 'నాడు-నేడు' పనులను పరిశీలించారు. ఈ మండలంలో 18 పాఠశాలలను ఎంపికచేసి పనులు ప్రారంభించగా, 16 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన రెండు పాఠశాలల పనులు కూడా త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. విశాలమైన గదులు, రక్షిత మంచినీటి వసతులు, మరుగుదొడ్ల సౌకర్యం ఇలా అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటుచేస్తుండడంతో పాఠశాలలకు కొత్త కళ వస్తోందన్నారు. అనంతరం ఆయన ప్రభుత్వం విద్యార్థులకు అమలుచేస్తున్న వివిధ పథకాల అమలు తీరు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాపూరు ఎంఇఓ శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ సహాయ కార్యక్రమాల అధికారి శివరాంప్రసాద్, హెచ్‌ఎంలు కామేశ్వరి, మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ అధికారి.. రమేష్‌రెడ్డి ఇక లేరు



విక్రమసింహపురి యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కె.రమేష్‌రెడ్డి ఈనెల 25న కరోనాతో కన్నుమూశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కోలుకున్నప్పటికీ తిరిగి ఆరోగ్యపరిస్థితి విషమించడంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే వివిఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అల్లం ఉదయ్‌శంకర్, ఇతర అధ్యాపకులు, సిబ్బంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. 2019లో డాక్టర్ రమేష్‌రెడ్డి రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారిగా చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా జాతీయస్థాయి అవార్డును కూడా అందుకుని జాతీయస్థాయిలో వివిఎస్‌యుకి మంచిపేరు తెచ్చారని వారు గుర్తు చేసుకుని, ఆయన సేవలను కొనియాడారు.

# మాట నిలబెట్టుకున్న సిఎం జగన్

## రెడ్డి సంక్షేమ సంఘం నాయకుల హర్షం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేద రెడ్ల సంక్షేమానికి ప్రత్యేకంగా రెడ్డి సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటుచేయడం పట్ల ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోవూరులో ఇటీవల జరిగిన ఆ సంఘం సమావేశంలో నాయకుడు మున్నెల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాట ప్రకారం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తూ జిఓ విడుదల చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు పి.రామమోహన్‌రెడ్డి, కోవూరు మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ప్రముఖులు కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# ఇద్దరు సిఐల బదిలీ

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు చెందిన ఇద్దరు సిఐలు కూడా బదిలీ అయ్యారు. నాయుడుపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.వేణుగోపాలరెడ్డిని రేంజ్ కార్యాలయానికి, ఆత్మకూరు సిఐ వైవి సోమయ్యను నాయుడుపేట సర్కిల్‌కు బదిలీ చేస్తూ డిఐజి త్రివిక్రమవర్మ ఆదేశాలు జారీచేశారు.

# అన్నదాతలకు ప్రభుత్వం చేయూత

## 6640 మంది రైతులకు 2.94 కోట్ల పంటల బీమా నగదు

**-జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**




రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలందిస్తున్నామని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. 2020 ఖరీఫ్‌కు సంబంధించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద అర్హులైన లబ్ది దారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25న రైతులకు పంటనష్టం పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా సిఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాలో 6640 మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 2 కోట్ల 94 లక్షల 88వేల 645 రూపాయలను ముఖ్యమంత్రి నేరుగా రైతుల ఖాతాల్లో జమచేశారని తెలిపారు. జిల్లాలో వరి, పసుపు పండిస్తున్న రైతుల్లో దిగుబడి నష్టపోయిన వారందరికీ పరిహారం నగదు జమచేయడం జరిగిందన్నారు. రానున్న వ్యవసాయ సీజన్‌కన్నా ముందుగానే ఈ నగదు వచ్చినందువల్ల రైతులకు ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఇబ్బందిలేకుండా ఈ నగదు ఉపయోగ పడుతుందన్నారు. జిల్లాలోని 9 లక్షల ఎకరాల్లో ప్రతిపొలంలో వ్యవసాయం జరిగేలా ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలను అందిస్తున్నామని, కోవిడ్ సమయంలో కూడా సచివాలయ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పంట నష్టం వివరాలు సేకరించి ఎంతో నిబద్ధతతో పనిచేశారని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించే నమూనా చెక్కును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ హరేందిరప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, వ్యవసాయశాఖ అధికారులు శివన్నారాయణ, ప్రసాద్, అనిత తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్‌రెడ్డిని పరామర్శించిన మంత్రి అనిల్



వాకాడు మండలం బాలిరెడ్డి పాళెం గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డిని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్ ఈనెల 23న పరామర్శించారు. దామోదర్ తండ్రి రాధాకృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందడంతో మంత్రి ఆ గ్రామానికి వెళ్ళి వారి కుటుంబాన్ని ఓదార్చారు. తొలుత రాధాకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. మంత్రి వెంట నాయకులు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, బుర్లా మహేష్‌రెడ్డి, వాకాటి రవి తదితరులున్నారు.

### డాక్టర్ రాధాజ్యోత్స్నలతకు నివాళి :

నెల్లూరులోని లెక్చరర్స్‌కాలనీలో ఉంటూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వైకాపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రాధాజ్యోత్స్నలత కుటుంబాన్ని మంత్రి అనిల్ పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ డెప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైకాపా యువజన విభాగం జిల్లాశాఖ అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను వణికిస్తూనే ఉన్న కరోనా

## ఒక్కరోజులోనే 1159 కేసులు

జిల్లాను కరోనా మహమ్మారి వ్యాధి వణికిస్తూనే ఉంది. రోజురోజుకు కోవిడ్ వైరస్ కేసులు పెరిగిపోతూనే ఉన్నాయి. ఈనెల 26న బుధవారం ఒక్కరోజే 1159 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఈ ఒక్కరోజే 8 మంది మృతి చెందారు. దీంతో ఇప్పటివరకు జిల్లాలో ఈ వ్యాధికి మృతిచెందిన వారి సంఖ్య 827కి పెరిగింది. మొత్తం 1,14,095 పాజిటివ్ కేసులు రాగా, యాక్టివ్ కేసులు 15,424 ఉన్నాయి. ఇప్పటిదాకా ఈ వ్యాధికి గురై కోలుకున్నవారి సంఖ్య 97,886 కాగా, వివిధ ఆసుపత్రుల్లో 2,212 మంది చికిత్సలు పొందుతున్నారు. కోవిడ్ వైరస్‌ను నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ మాస్కులు ధరించి, కోవిడ్ నిబంధనలు పాటించాలని, ఎక్కడా గుంపులుగా తిరగవద్దని, భౌతికదూరం పాటించాలని వైద్యులు, అధికారులు పదేపదే చెప్తూనే ఉన్నారు.

# కోవిడ్ కోసం కోటిన్నర రూపాయలిచ్చిన అన్నదమ్ములు



కోవిడ్ నివారణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యలకు చేయూతగా తమ సంస్థ కెఎంసి కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ తరపున కోటి 50 లక్షల రూపాయల విరాళాన్ని ఇటీవల ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి అందజేసిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి

# పెన్నానదిపై రెండో వంతెన

## • రెండు లేన్ల బ్రిడ్జికి ప్రతిపాదనలు సిద్ధం

పెన్నానదిపై మరో కొత్త వంతెన నిర్మాణానికి రాష్ట్ర జలవనరుల మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ కృషి ప్రారంభించారు. నగరంలోకి వచ్చేందుకు సుమారు నూరేళ్ళ క్రితం పెన్నానది వారధి ఏర్పాటై ఉండగా, ఆ తర్వాత 70ఏళ్ల క్రితం రెండు లేన్ల వంతెన నిర్మించారు. అయితే నిత్యం ట్రాఫిక్ రద్దీతో అత్యధికంగా ఉన్న నేపథ్యంలో పాత వంతెనపై వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు చేస్తుండడంతో తరచూ మరమ్మతులు చేయాల్సి వస్తోంది. దీంతో పాత వంతెనకు పక్కనే మరో రెండు లేన్లతో కొత్త వంతెన నిర్మించాలంటూ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ప్రతిపాదించారు. దీనిపై నివేదిక తయారుచేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. రవాణా, జాతీయ రహదారుల శాఖ ఈ ప్రతిపాదనలు ఖరారుచేసి రాష్ట్ర వార్షిక ప్రణాళికలో పొందుపరచడంతో, సుమారు నూరుకోట్ల రూపాయల వ్యయంతో వంతెన రహదారి నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని భావిస్తున్నారు. ట్రాఫిక్ అబందరను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసేందుకు పాత వంతెనకు సమాంతరంగా మరో బ్రిడ్జి ఏర్పాటు చేయాలని, నిర్మాణ వ్యయం అంచనా వేసి ప్రతిపాదనలు పంపారు. అన్నీ అనుకూలిస్తే త్వరలోనే కొత్త వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టవచ్చని భావిస్తున్నారు.

## 45 ఏళ్ళు దాటిన వారికి తొలిడోసు టీకా

జిల్లాలో 45 ఏళ్లు దాటిన వారందరికీ ఈనెల 26 నుంచి నాలుగు రోజుల పాటు కోవిడ్ నివారణకు వ్యాక్సిన్ వేస్తున్నట్లు డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి తెలిపారు. వీరికి కోవీషీల్డ్ మొదటి డోసును ఇస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, అర్బన్ ప్రాంతాల్లోని యూహెచ్‌సీలలో వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. ప్రజలు ఈ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని ఆమె కోరారు.

## అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నగరంలోని ఎన్‌టీపీఎం ప్రభుత్వ ఉన్నత అధ్యయన సంస్థ (బీఈడీ కళాశాల), పల్లిపాడులోని ప్రభుత్వ జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) కళాశాలల్లో డిప్యూటేషన్ పద్ధతిన అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. పదేళ్ల అనుభవం కలిగినవారు వారి దరఖాస్తులను ఆ సంస్థల ప్రధానాచార్యులకు జూన్ 1 నుంచి 5వ తేదీ లోపు సమర్పించాలని కోరారు.

# శాస్త్రోక్తంగా.. పెంచలకోన బ్రహ్మోత్సవాలు

### -- స్వామివార్లను దర్శించుకున్న వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం --



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న జరిగిన స్వామివారి కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవార్లను స్వర్ణాభరణాలతో, పూల అలంకారాలతో శోభాయమానం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అతికొద్దిమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


# 'ప్రగతి' ఆధ్వర్యంలో మాస్కులు పంపిణీ



గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇటీవల పలువురు దాతలు, మిత్రుల సహకారంతో గూడూరు మున్సిపాలిటీలోని సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు పంపిణీ చేశారు. గూడూరు మున్సిపల్ ఆర్.ఓ కృష్ణారెడ్డి, పొణకా మల్లికార్జునరెడ్డి చేతులమీదుగా వాటిని అందజేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ప్రజేందర్‌రెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# పడగ విప్పుతున్న.. 'ఫంగస్'లు



ఒకవైపు కరోనా రాకాసి పీడ, మరో వైపు ఫంగస్ వ్యాధుల చీడ.. ఇలా అన్నిరకాల చీడపీడలూ చుట్టుముట్టి కరోనా బాధితుల ప్రాణాల్ని తోడేస్తున్నాయి. బ్లాక్ ఫంగస్, వైట్ ఫంగస్, ఎల్లో ఫంగస్ అంటూ రకరకాల ఫంగస్‌లు పడగ విప్పుతూ కరోనా బాధితులను కాటేసేందుకు కోరలు చాస్తున్నాయి. ఈ ప్రాణాపాయపరిస్థితుల నుంచి బాధితులను కాపాడాల్సి ఉంది. కరోనా బాధితుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ఫంగస్‌లను వెంటనే నివారిం చేందుకు కేంద్రంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

దేశంలో కరోనా బాధితుల సంఖ్య 2 కోట్లా 67 లక్షలకు పైగా, మరణాల సంఖ్య 3 లక్షలా 3వేల మందికి పైగా పెరిగిన నేటి అత్యంత దారుణ విపత్కర పరిస్థితుల్లో మూడో దశ కరోనా వస్తే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందోనని అందరూ బెంబేలెత్తిపోతున్న తరుణంలో.. గోరుచుట్టుపై రోకటి పోటులా పలు రకాల ఫంగస్ వ్యాధులు కూడా పడగవిప్పి కాటేయడానికి కోరలు చాస్తున్నాయి. ఒకవైపు కరోనా రాకాసి పీడ, మరో వైపు ఫంగస్ వ్యాధుల చీడ..ఇలా అన్ని చీడపీడలూ చుట్టుముట్టి కరోనా బాధితుల ప్రాణాల్ని తోడేస్తున్నాయి. కరోనా రెండోదశను ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు యుద్ధం చేస్తూ వ్యాక్సినేషన్‌లు, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు వగైరాలన్నీ సిద్ధం చేస్తున్నా కరోనా మాత్రం లెక్కచేయకుండా విజృంభిస్తూనే ఉంది. గత వారం రోజులుగా ఈ మహమ్మారి వ్యాధి వ్యాప్తి కొంత తగ్గుతున్నట్లనిపించినా, దేశంలో రోజువారీ మరణాల సంఖ్య మాత్రం ఇంకా నాలుగువేలకు పైగానే ఉంటోంది. ఒకవైపు కరోనా మహమ్మారి మరణమృదంగం మోగిస్తూ దేశాన్ని అల్లకల్లోలం చేస్తూంటే మరోవైపు పొంచివున్న ఫంగస్ వ్యాధులు కూడా మీపని పట్టడానికి మేమున్నామంటూ బాధితుల ప్రాణాలను పీక్కుతింటున్నాయి. ఎన్నో అవస్తలు పడి కరోనా కోరల నుంచి బయటపడి కోలుకున్నవారికి కూడా ఈ ఫంగస్ వ్యాధులతో ముప్పుతిప్పలు తప్పడం లేదు. ఇంతకన్నా దురవస్థ ఎక్కడుంటుంది?.. కరోనా తొలిదశ కన్నా, రెండోదశ మరింత ప్రమాదకరంగా మారి దేశప్రజల్ని భయకంపితుల్ని చేస్తోంది. కరోనాతో మృత్యువాత పడుతున్న వారి సంఖ్య ఇటీవల విపరీతంగా పెరిగింది. దీంతోనే అష్టకష్టాలు పడుతుంటే, మరోవైపు చికిత్స చేసుకుని కరోనా నుంచి కోలుకుంటున్నామని అనుకుంటుండగానే ఫంగస్ వ్యాధులు అంటుకుంటూ మళ్ళీ ప్రమాదకరస్థితిలోకి నెట్టేస్తున్నాయి. బ్లాక్ ఫంగస్, వైట్ ఫంగస్, ఎల్లో ఫంగస్ ఇలా రకరకాల ఫంగస్‌లు ఇప్పుడు దేశంలోని అనేక ప్రాంతాల్లో విజృంభిస్తూ కరోనా బాధితులను పట్టి పీడిస్తున్నాయి. వీటిని వెంటనే గుర్తించి చికిత్సలు చేయించుకోకపోతే చివరికి ప్రాణాలకే ముప్పు ఏర్పడుతోందని నిపుణులు ఘంటాపథంగా చెప్తున్నారు. ఇప్పటికే దేశంలోని 18 రాష్ట్రాల్లో 5425 మందికి బ్లాక్ ఫంగస్ (మ్యూకో మైకోసిస్) అనే వ్యాధి సోకిందని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంటోంది. వీరిలో 4556 మందికి గతంలో కోవిడ్ సోకిందని, బాధితుల్లో 55 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నవారేనని అంటున్నారు. ముఖ్యంగా కరోనా సోకి ఇతరత్రా ఆరోగ్య సమస్యలున్నవారికి, లేదా స్టెరాయిడ్ మందులను మితిమీరి వినియోగించినవారికి, ఐసియులో చికిత్సలు పొందినవారికి బ్లాక్ ఫంగస్ ముప్పు ఎక్కువగా ఉందని, వారు గాలి పీల్చుకున్నప్పుడు ఈ ఫంగస్ సైనస్‌కు, ఊపిరితిత్తుల్లోకి చేరుతోందని, కరోనా సెకండ్‌వేవ్‌లో ఈ తరహా కేసులు పెరుగుతుండడం ప్రస్తుత పరిస్థితుల్లో ఒక సవాలుగా పరిణమించిందని వారు చెప్తున్నారు. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో బ్లాక్ ఫంగస్ వ్యాధి ఎంతోమంది ప్రాణాలను బలితీసుకోవడమే కాక, ఈ వ్యాధికి గురైన మరెంతోమంది నేటికీ ఆసుపత్రుల్లో నరకయాతనలు పడుతున్నారు. ఈ ఫంగస్‌తో బాధపడుతున్నవారికి ఉపశమనం కలిగించే మందులు, ఇంజెక్షన్లకు కూడా ఇప్పుడు బాగా గిరాకీ పెరిగిపోయింది. ఇంకేముందీ..అవి కూడా షరామామూలుగానే బ్లాక్‌మార్కెట్‌కు చేరిపోయి, వీటి ధర కూడా చుక్కలు చూపిస్తుండడంతో వాటిని కొనలేక బాధితులు పడే బాధలు వర్ణనాతీతం. ఇప్పటికే బ్లాక్ ఫంగస్, వైట్ ఫంగస్‌లతో భయపడి చస్తుంటే ఇంకోవైపు ఎల్లో వైరస్ కూడా కోరలు చాస్తుండడంతో ప్రజల ప్రాణాలు పైపైనే పోతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో తాజాగా ఎల్లో ఫంగస్‌ను వైద్యనిపుణులు గుర్తించారు. ఇది బ్లాక్ ఫంగస్, వైట్ ఫంగస్‌ల కంటే ఎంతో ప్రమాదకరమైనదిగా భావిస్తున్నారు. ఈ వ్యాధి బారినపడిన వారిలో ఆకలి క్షీణించడం, బరువు తగ్గడం, బద్దకం వంటి లక్షణాలు కనిపిస్తాయని, వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు గాయాలేమైనా తగిలితే మానడం కష్టమని, ఈ వ్యాధికి వెంటనే చికిత్స చేయకపోతే ప్రాణాపాయంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల ఈ ఫంగస్ సోకుతుందని, అందువల్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా 'వైట్ ఫంగస్' అనేది ప్రాణాంతకం కాకపోయినా, కంటి రెటీనాను దెబ్బతీసి జీవితాన్ని అంధకారబంధురం చేస్తుందని, కళ్ళలో చారలు ఏర్పడి రోగి చూపును కోల్పోయేలా చేస్తుందని నిపుణులు చెప్తున్నారు. బ్లాక్ ఫంగస్ మాదిరిగానే వైట్ ఫంగస్ కూడా బ్లడ్‌షుగర్ ఎక్కువగా ఉన్న రోగులకు కోవిడ్ చికిత్సలో భాగంగా ఇచ్చే స్టెరాయిడ్ మందులు ఎక్కువగా వాడడం వల్ల వస్తుందంటున్నారు. కళ్ళలో చారలు ఏర్పడినప్పుడే చికిత్స చేయించుకుంటే చూపు కోల్పోకుండా చూసుకోవచ్చంటున్నారు. కరోనా త్వరగా తగ్గిపోవాలన్న తొందరలో విచక్షణా రహితంగా స్టెరాయిడ్ మందులు వాడితే కరోనా తగ్గిపోయినా ఇలాంటి ఫంగస్ వంటి ఇతర భయంకర వ్యాధులు కూడా అంటుకుంటున్నాయని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందువల్ల కోవిడ్ చికిత్సలో ఎంతో జాగ్రత్తలు అవసరమని పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా..కరోనా పోవాలని మందు వేసుకుంటే ఫంగస్‌లు వచ్చిపడుతుండడం ఎంత బాధాకరం!.. కొండనాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందన్న సామెతగా ఉందిప్పుడు పరిస్థితి. ఈ దురవస్తల నుంచి బాధితులను సత్వరం కాపాడేందుకు కేంద్రప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, వైద్యనిపుణులు, శాస్త్రవేత్తలు కృషిచేయాల్సి ఉంది. కరోనా మూడోముప్పు రాకుండా, ఒకవేళ వచ్చినా ఎలాంటి ప్రాణనష్టాలు జరగకుండా తక్షణ చర్యలతో పాటు, కరోనా బాధితుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ రకరకాల ఫంగస్‌లను వెంటనే నివారించేందుకు సమిష్టిగా చర్యలు తీసుకొని బాధితుల ప్రాణాలను కాపాడాల్సి ఉంది.

## ప్రముఖ పాథాలజిస్ట్..

# డాక్టర్ శ్రీధర సత్యనారాయణ.. ఇక లేరు



నెల్లూరు జిల్లా వెంకటగిరి వాస్తవ్యుడు, భారత ఆర్మీ వైద్య సర్వీసులో 31 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించిన కల్నల్ డాక్టర్ శ్రీధర సత్యనారాయణ ఇటీవల సికింద్రాబాద్‌లోని సైనిక ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వెంకటగిరికి చెందిన పముఖ రంగస్థల, సినీ నటుడు, రిటైర్ట్ పోస్ట్‌మాస్టర్ ఎస్.ఎల్.నరసింహం పెద్ద కుమారుడైన సత్యనారాయణ తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదివి 1977లో భారత ఆర్మీలో మెడికల్ ఆఫీసర్‌గా చేరారు. పూణేలోని ఏఎఫ్ఎంసీలో పాథాలజీ సబ్జెక్ట్‌లో ఎం.డి పట్టాపొందారు. ఆస్పిరేషన్ సైటాలజీ, ఎయిడ్స్ రోగ నిర్ధారణ మొదలైన ప్రత్యేక అంశాలలో ఆయనెంతో నైపుణ్యం సాధించారు. నీడిల్ నెక్రోప్సీ అనే కొత్త ప్రక్రియను రూపొందించి రోగ నిర్ధారణ చేసేవారు. అంటువ్యాధుల విపత్తు తర్వాత జరిపే పరీక్షల కోసం సంచార క్షేత్ర ప్రయోగశాలను రూపొందించి ప్రపంచ ఆరోగ్యసంస్థ గుర్తింపు పొందారు. దేశంలోని ప్రధాన ఆర్మీ ఆసుపత్రులు, కళాశాలల్లో డాక్టర్ సత్యనారాయణ విశేషమైన బోధన మరియు పరిశోధన అనుభవం సంపాదించారు. ఆర్మీ నుండి ఉద్యోగ విరమణ తర్వాత డాక్టర్ సత్యనారాయణ, రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో పాథాలజీ విభాగం ప్రొఫెసర్ అండ్ హెడ్‌గా పనిచేశారు. ఆయన ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ పాథాలజీ కౌన్సిల్ సభ్యుడు కూడా. జర్నల్ ఆఫ్ సైటాలజీ మరియు జర్నల్ ఆఫ్ పాథాలజీ అండ్ మైక్రోబయాలజీ పత్రికలకు ఎడిటర్ ఇన్ ఛీఫ్‌గా వ్యవహరించారు. ఆయన 53 పరిశోధనా వ్యాసాలను జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో ప్రచురించారు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, కెనడా మొదలగు దేశాలలో పాథాలజీపై అంతర్జాతీయ సమావేశాలలో పాల్గొన్నారు. అలాంటి అనేక సదస్సులను మనదేశంలో నిర్వహించారు. డాక్టర్ సత్యనారాయణ ప్రతిభకు గుర్తింపుగా ఆయనకు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైటాలజిస్ట్స్ వారు 2008వ సంవత్సరంలో ఎర్నెస్ట్ ఫెర్నాండెజ్ అవార్డును అందజేశారు. ఎంతో విశిష్టమైన స్థాయిని అందుకున్న ఆయన మృతి బాధాకరమని ఆయన సహచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు విఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యంకు సత్యనారాయణ స్వయానా బావ అవుతారు. సత్యనారాయణ మృతికి విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబసభ్యులకు నెల్లూరులోని ఆయన స్నేహితులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## ఆనందయ్య మందుపై

# ఢిల్లీలో పరిశోధన

**- జేసీ గణేష్‌కుమార్**

కరోనా నివారణకు కృష్ణపట్నంలోని ఆనందయ్య ఇచ్చే మందుపై ఢిల్లీలో కూడా పరిశోధన జరుగుతోందని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఈనెల 24న ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, జిల్లాలో భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) బృందం పర్యటనకు సంబంధించి ఎటువంటి అధికారిక సమాచారం లేదని, కానీ ఆనందయ్య మందుపై క్షేత్రస్థాయి సర్వే జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆయుష్ కమిషనర్ బృందం జిల్లాలో పర్యటించి ఆనందయ్య మందుపై శాంపిల్స్ తీసుకెళ్లడం జరిగిందని, ఆ బృందం వాటిపై పరిశోధన చేసి నివేదిక ఇవ్వాల్సి ఉందని, ఇప్పటిదాకా ఎటువంటి నివేదిక అందలేదని ఆయన పేర్కొన్నారు.

## శివాలయం పూజారి..

# కరోనాతో కన్నుమూత

ఇందుకూరుపేటలోని కామాక్షిదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు రామాయణం శివకుమార్‌స్వామి కొద్దిరోజుల క్రితం కరోనా సోకడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల కరోనాతో మృతిచెందారు. ఆయన మృతికి జిల్లా అర్చక సమాఖ్య కమిటీ కార్యదర్శి ఉదయగిరి శేషాచార్యులు, సభ్యులు విచారం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# మురుగు కాలువల్లో పూడిక తీయించండి




నెల్లూరు నగరం మురుగు నగరం అనేమాట ప్రసిద్ధమవుతూ ఉంది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా నగరంలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోతూనే ఉంది. మురుగు కాలువల్లో సక్రమంగా పూడికతీయడం లేదు. ఇళ్ళ వద్ద సైడు కాలువల్లో మురుగంతా నిండిపోయి వీధుల్లోకి పొర్లిపోతోంది. దీంతో ఎక్కడ చూసినా వీధులు గబ్బుకొట్టిపోతున్నాయి. అందుకు తగ్గట్టుగానే కొంతమంది తమ ఇష్టానుసారం ఎక్కడంటే అక్కడ చెత్త వేస్తుండడంతో అదంతా చివరికి మురుగు కాలువల్లోకి చేరిపోతోంది. దీంతో దోమలు పెరిగిపోయి రకరకాల వ్యాధులు వస్తూనే ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులు నిర్ణీత సమయంలో ఇళ్ళ వద్దకు వచ్చి చెత్తను తీసుకుపోతున్నా కూడా టన్నుల కొద్దీ చెత్త వీధుల్లో ఇంకా ఉంటోంది. ఈ పరిస్థితి ఎప్పుడు పోతుందో ఏమో!.. కార్పొరేషన్ ఉన్నతాధికారులు నగరంలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేయిస్తుండడంతో పాటు ఎప్పటికప్పుడు మురుగు కాలువల పూడిక తీయించే కార్యక్రమం కూడా చేపట్టి ఈ దుర్గంధాన్ని నివారించాలని విజ్ఞప్తి.

**– ఆర్.సురేష్, నెల్లూరు.**

# నిరుపేదలను ఆదుకోవాలి

ఈ కరోనా కష్టకాలంలో పనులు దొరక్క కష్టజీవులు, నిరుపేదలు ఎన్నో బాధలు పడుతున్నారు. కరోనా విజృంభిస్తున్న పరిస్థితుల్లో ఏ ఇంటికి వెళ్లి పని చేయాలన్నా ఎవరూ పిలవడం లేదు. దీంతో జీవనోపాధి కష్టమై భార్యాబిడ్డలను పోషించుకోలేక వేలాది మంది పేదలు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఈ వేసవిలో ఎక్కువగా భవన నిర్మాణ పనులు, ఇళ్ళ మరమ్మత్తుల పనులు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు వాటికి కూడా ఎవ్వరూ పిలవకపోవడంతో మేస్త్రీలతో సహా వేలాదిమంది రోజు కూలీల బ్రతుకు భారమైపోయింది. ఈ అవస్థలు ఇంకా ఎన్నాళ్ళుంటాయో మరి! ప్రభుత్వాలు, దాతలు ఆదుకోకుంటే నిరుపేదల బ్రతుకులు అగమ్యగోచరంగా మారుతాయి. ఒకవైపు కరోనా భయం, మరోవైపు జీవనం జరక్కపోవడంతో రోజురోజుకీ పరిస్థితి దయనీయంగా మారుతోంది. గత సంవత్సరంలో పోలిస్తే ఈ సంవత్సరం దాతలు, స్వచ్ఛంధ సంస్థలు చేస్తున్న సాయం కొంత తక్కువే అనిపిస్తోంది. ఎవరిని సాయం అడగాలో తెలియక రోజు కూలీలకు పూట గడవడమే కష్టంగా మారుతోంది. ప్రభుత్వాలు వెంటనే నిరుపేదలందరికీ ఈ కష్టకాలంలో పూర్తిస్థాయిలో నిత్యావసర సరుకులతో పాటు తగు ఆర్థిక సాయాన్ని కూడా అందించి ఆదుకోవాలి.

**– సుబ్బరామయ్య, కొత్తూరు.**

## రెండో దశ కరోనా దెబ్బతో..

# మళ్ళీ కష్టాల్లో నిమ్మ రైతులు

**• రవాణా లేకపోవడంతో నష్టపోతున్న వ్యాపారులు**




***కొద్దిరోజుల క్రితం నిమ్మ ధరలు బాగానే ఉండడం, ఎగుమతులు కూడా పెరగడంతో చాలా రోజుల తర్వాత నిమ్మ మార్కెట్ కళకళలాడుతోందని రైతులు సంతోషంగా ఉన్న తరుణంలో మళ్ళీ లాక్‌డౌన్‌లు వచ్చిపడడం, రవాణా వ్యవస్థ స్తంభించిపోవడంతో ఎగుమతులు ఆగిపోయి నిమ్మరైతులు కుదేలయ్యారు. దీంతో జిల్లాలోని గూడూరు, పొదలకూరు నిమ్మమార్కెట్‌లలో వ్యాపారం తగ్గిపోయి రైతులు నిరాశా నిస్పృహల్లో పడిపోయారు. కరోనా కష్టాలు తీవ్రంగా ఉండడంతో నిమ్మ మార్కెట్‌లు కూడా మూడురోజులకు కుదించుకుపోయాయి. అనేకమంది రైతులు ఇక చేసేదేమీ లేక తోటల్లోనే కాయలు వదిలేసుకుంటున్నారు.***

నిమ్మ రైతుల పాలిట కరోనా ఒక రాకాసిలా తయారైంది. నిమ్మరైతులకు తీరని కష్టాలను నష్టాలను తెచ్చి వారి జీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. కొద్ది రోజుల క్రితం నిమ్మకు మంచి డిమాండ్ ఉండడంతో కాస్తంత ఊపిరి పీల్చుకున్న రైతులను ఇప్పుడు రెండో దశ కరోనా మళ్ళీ కుంగదీస్తోంది. కరోనా దెబ్బకి నిమ్మమార్కెట్‌లు కుదేలైపోతుండడంతో జిల్లాలోని నిమ్మరైతులు పండిన పంటను అమ్ముకోలేక నానా యాతనలు పడుతున్నారు. జిల్లాలో ప్రధానంగా ఉన్న గూడూరు, పొదలకూరు నిమ్మమార్కెట్‌లకు రైతులు నిమ్మకాయలను తీసుకువస్తే అక్కడి నుంచి దేశంలోని అనేకప్రాంతాలకు అవి ఎగుమతి అవుతుంటాయి. కానీ ఇప్పుడు లాక్‌డౌన్‌ల ప్రభావంతో రవాణా కష్టతరం కావడంతో రైతులు కష్టాల్లో పడ్డారు. గతంలో కూడా తొలిదశ కరోనాలో గూడూరు, పొదలకూరు మార్కెట్లు ఆరునెలల పాటు మూతపడ్డాయి. రైళ్ళు, వాహనాల రాకపోకలు సరిగా లేకపోవడంతో రవాణాకు అవకాశం లేకఎగుమతులు ఆగిపోయాయి. జిల్లాలో స్థానిక మార్కెట్లకు కూడా అమ్ముకునే వెసులుబాటు లేక తోటల్లోనే కాయల్ని ఎండబెట్టుకుని నానా అవస్తలు పడ్డారు. రెండోవిడత కరోనా రాకముందు కొద్దిరోజుల పాటు నిమ్మకాయలకు బాగా డిమాండ్ పెరిగింది. దీంతో వాటి ధర కిలో 60 నుంచి 70 రూపాయల దాకా పెరగడం, ఎగుమతులు కూడా బాగానే జరుగుతుండడంతో నిమ్మరైతుల్లో ఆశలు చిగురించాయి. 80 కిలోల లూజు బస్తా 4వేల నుంచి 4500 దాకా ధర పలికింది. నిమ్మ పంటకు ఇది సీజన్ కావడంతో నిమ్మకాయల దిగుబడి కూడా బాగానే ఉంది. కానీ, ధర బాగా తగ్గిపోయింది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే అప్పుల బాధలు మరింత పెరుగుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### పంట పుష్కలంగా ఉన్నా.. అమ్మకాలు కరువు :

జిల్లాలోని గూడూరు, సైదాపురం, బాలాయపల్లి, రాపూరు, వెంకటగిరి, పొదలకూరు, సూళ్ళూరుపేట తదితర అనేక ప్రాంతాల్లో నిమ్మసాగు విస్తారంగా ఉంది. కానీ ఆశించిన ధరలు.. అమ్మకాలు మాత్రం కరువైపోయాయి. జిల్లా మొత్తమ్మీద దాదాపు 14 వేల హెక్టార్లలో నిమ్మ సాగవుతోంది. పరిస్థితులన్నీ అనుకూలిస్తే సీజన్‌లో సుమారు 62వేల టన్నుల దాకా నిమ్మకాయల దిగుబడి ఉంటుందని అంచనాలు కూడా వేసుకున్నారు. ప్రధానంగా ఢిల్లీ, కలకత్తా, బెంగుళూరు, చెన్నై తదితర నగరాలకు కూడా రోజూ ఇక్కడ నుంచే నిమ్మకాయలు వెళ్తుంటాయి. ఎట్టకేలకు నిమ్మ ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, ఇలా కొద్దికాలం సాగితే నష్టాల నుంచి కోలుకుంటామని రైతులు సంతోషంలో ఉండగానే ఇప్పుడు రెండోదశ కరోనా మరింత తీవ్రంగా ఉండడం వల్ల ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో లాక్‌డౌన్‌లు, జిల్లాలో కూడా పాక్షిక లాక్‌డౌన్‌లతో నిమ్మను ఎగుమతి చేసుకోలేక, ఇతర ప్రాంతాలకు వెళ్లి నిమ్మకాయలను అమ్ముకోలేక రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా ఢిల్లీ, జైపూర్, బీహార్, లక్నోలతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలకు, పొరుగు రాష్ట్రమైన తెలంగాణకు కూడా వెళ్ళే పరిస్థితులు లేక రైతులు లబోదిబోమంటున్నారు. చివరికి జిల్లాలో కూడా కోవిడ్ కేసులు ఎక్కువగా ఉండడంతో జిల్లాలోని ఇతరప్రాంతాల్లో కూడా నిమ్మకాయల అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. ఈ బాధలు తట్టుకోలేక ఇక చేసేదేమీ లేదన్నట్లుగా నిమ్మ ఎగుమతికి ప్రసిద్ధమైన గూడూరు మార్కెట్ వారంలో కేవలం మూడురోజులు అదీ... శుక్ర, శని, ఆదివారం రోజుల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. గూడూరులో కూడా పాక్షిక లాక్‌డౌన్ ఉన్నందువల్ల ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా మాత్రమే ఉన్న కొద్దిపాటి సమయంలోనే మార్కెట్ నిర్వహించుకోవాల్సి వస్తోందని, ఎగుమతులన్నీ ఆగిపోయి, విక్రయాలు బాగా తగ్గిపోవడంతో నష్టాలు తప్పడం లేదని అటు రైతులు, ఇటు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బాగానే ఉన్నా రవాణా లేకపోవడంతో, పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందక విధిలేని పరిస్థితుల్లో అనేకమంది రైతులు వాటిని తోటల్లోనే వదిలేస్తున్నారు.

## 'బ్లాక్ ఫంగస్' నివారణకు ప్రత్యేక ఆసుపత్రి

### అధికారులకు సూచించిన మంత్రి అనిల్



కరోనా నేపథ్యంలో బ్లాక్ ఫంగస్ వ్యాధి నివారణకు అవసరమైన ప్రత్యేక ఆసుపత్రిని 50 పడకలతో ఏర్పాటుచేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబుకు, అధికారులకు సూచించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై జిల్లాలో కోవిడ్ ఉధృతిని కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్లు, అధికారులు రాత్రింబవళ్ళు కోవిడ్ నివారణకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, వారి సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వైద్యులు నిరంతరం ఎంతో శ్రమిస్తూ కరోనా బాధితులకు చికిత్సలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కరోనాను నియంత్రించేందుకు అనునిత్యం కృషిచేస్తున్నారని, నెల్లూరుకు కూడా అవసరమైన మందులు, ఆక్సిజన్ ప్లాంట్‌లను మంజూరుచేశారని చెప్పారు. రాష్ట్రంలో తొలిదశలో 65 ఆక్సిజన్ ప్లాంట్‌ల ఏర్పాటుకు టెండర్లు కూడా పిలవడం జరిగిందని, కోవిడ్ బాధితులకు ఆక్సిజన్ కొరత లేకుండా సమకూర్చడానికి ముఖ్యమంత్రి అన్నిచర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. చిన్నపిల్లలు కోవిడ్ బారినపడకుండా ఉండేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. మనోధైర్యంతో ఈ వ్యాధిని ఎదుర్కోవాలని, ప్రతిఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటిస్తూ కరోనాను కట్టడి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ హరేంధిరప్రసాద్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్, కోవిడ్ నోడల్ అధికారి డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాభవన్‌లో రాజీవ్ వర్ధంతి



మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 30వ వర్ధంతి కార్యక్రమం నెల్లూరులోని ఇందిరా భవన్‌లో ఇటీవల ఘనంగా జరిగింది. తొలుత రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వద్ద ఉన్న రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి పేదలకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, మున్వర్ బాషా, మహబూబ్‌భాషా, ఖాజారసూల్ తదితరులు పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ నివాళి

రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకుంటూ ఆయన వర్ధంతినాడు నెల్లూరులోని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు గణేష్‌బాబు, రాజేష్‌రెడ్డి, పెంచలయ్య, కృష్ణ, కార్తీక్, హర్షవర్ధన్ తదితరులు పెద్దాసుపత్రిలోని రోగులకు అల్పాహారంతో పాటు మాస్కులు కూడా అందజేశారు.

## సత్యసాయి సేవాసమితి ఔదార్యం



కోవిడ్ బారిన పడి ఇంటివద్ద చికిత్స పొందుతూ భోజనం కోసం ఇబ్బందిపడుతున్న అనేక మంది బాధితులకు నగరంలోని సత్యసాయి సేవాసమితి ఆహార పొట్లాలను అందజేస్తూ తన ఔదార్యాన్ని చాటుకుంది. ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక గోమతినగర్ ప్రాంతంలో ఉన్న 45 మంది వృద్ధులకు, మరో 300 మంది నిరుపేదలు, అనాథలు, వలస కార్మికులకు అన్నం ప్యాకెట్లు అందజేశారు. కరోనా సోకి అన్నం వండుకోలేని మరో 75 మందికి సత్యసాయి ప్రేమప్రసాదం పేరుతో పౌష్టికాహారాన్ని పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.

## నెల్లూరు కబుర్లు

### రేషన్‌కార్డులున్న వారికి..

## త్వరలో వైఎస్సార్ బీమా

రేషన్‌కార్డులున్న వారందరికీ త్వరలోనే వైఎస్సార్ బీమా పథకం అమలుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం అందజేయాలని ఈనెల 24న నెల్లూరులోని డిఆర్‌డిఏ కార్యాలయంలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో జేసీ (ఆసరా) బాపిరెడ్డి సూచించారు. వలంటీర్లు సర్వే చేసి మొబైల్ యాప్‌లో వివరాలు నమోదుచేసి బ్యాంకర్లకు అందజేస్తారని, బ్యాంకర్లు ఈ పథకం పట్ల దృష్టిసారించి వివరాలను అప్‌లోడ్ చేయాలని, లేకుంటే పేదలు నష్టపోతారని చెప్పారు. బ్యాంకర్లు ఈ ఆదేశాలను పాటించి వలంటీర్లు ఇచ్చిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. డిఆర్‌డిఏ పి.డి సాంబశివారెడ్డి, మెప్మా పి.డి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ టీకా వేయించుకోవాలి

కరోనా వ్యాధి నివారణకు ప్రతిఒక్కరూ టీకా వేయించుకోవాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ చెప్పారు. ఇటీవల ఆయన నగరంలోని కోటమిట్ట, కిసాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకా కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయించుకునేవారు తప్పనిసరిగా మాస్కులు ధరించి భౌతికదూరం పాటించాలన్నారు. హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## నెలాఖరులోగా నాడు-నేడు పనులు

### డిఇఓ రమేష్

జిల్లాలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ సంబంధిత ఉద్యోగులు, సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని పొదలకూరురోడ్డులో ఉన్న జడ్పీ హైస్కూలులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఈ పనుల పట్ల ఏమాత్రం అశ్రద్ధ చూపకుండా సత్వరం పూర్తిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు విశాలమైన గదులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఇలా అన్ని వసతులకు కొరత లేకుండా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

## పేదలకు అన్నం ప్యాకెట్లు పంపిణీ



నెల్లూరులోని సర్వేపల్లి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న నగరంలోని పెద్దాసుపత్రి వద్ద సుమారు 200 మంది పేదలకు ఆహారపొట్లాలు పంపిణీ చేశారు. దర్గామిట్ట పోలీస్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరమ్మ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సేవా కార్యక్రమానికి అమెరికాలో ఉన్న పార్ధు, డాక్టర్ చందన సహకరించారని సర్వేపల్లి సేవాసమితి అధ్యక్షుడు సుధీర్ తెలిపారు. సమితి సభ్యులు సోను, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు..

## అమ్మా యూత్ చేయూత

నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నగరంలోని అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. 7వ డివిజన్ పరిధిలోని తోటబడి వద్ద దాబిశెట్టి కల్యాణి సహకారంతో ఆ ఫౌండేషన్ వారు కూరగాయలు, గోధుమపిండి వగైరాలను అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, శరత్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## రెహమాన్ కుటుంబానికి అండగా ఉంటాం

### జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్



కరోనాకు గురై మరణించిన జిల్లా ఏఆర్(డాగ్ స్క్వాడ్) హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ అన్నారు. తొలుత ఆయన రెహమాన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నెల్లూరు దర్గామిట్టలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన రెహమాన్ 1995లో పోలీసుశాఖలో చేరారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కరోనాకు గురై నగరంలోని జిజిహెచ్ ఆసుపత్రిలో ఇటీవల మృతిచెందడంతో జిల్లా ఎస్పీతో పాటు ఏఎస్పీ వెంకటరత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ వీరభద్రుడు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్, శ్రీనివాసులురెడ్డి తదితర అధికారులు రెహమాన్ నివాసానికి వెళ్ళి, ఆయన కుటుంబాన్ని పరామర్శించి వారికి తమ సంతాపాన్ని తెలియజేశారు.

### కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మెన్..

## దాసా సురేష్‌రాజు కన్నుమూత



నెల్లూరులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ చైర్మెన్ దాసా సురేష్‌రాజా ఈనెల 24న గుండెపోటుతో కన్నుమూశారు. కరోనా నుంచి కోలుకొని చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నెల్లూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయ పునర్నిర్మాణానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన మృతి తమనెంతో కలచివేసిందని విచారం వ్యక్తం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తదితర ఆర్యవైశ్య ప్రముఖులు తమ సంతాపం తెలిపారు.

## పోస్టల్ అధికారి మృతికి సంతాపం



పోస్టల్ అధికారి (పబ్లిక్ రిలేషన్ ఇన్స్‌పెక్టర్) నీలిశెట్టి వెంకట సుధాకరరావు అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందారు. ఆయన మృతికి విచారం వ్యక్తంచేస్తూ తపాలా ఉద్యోగుల సంఘ నాయకులు ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

### ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు

## వ్యాక్సిన్ వేయాలి

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబసభ్యులకు కోవిడ్ వ్యాక్సిన్‌ను వేసేలా వెంటనే ఆదేశాలు జారీచేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుడు చొప్పా రవీంద్రబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఎన్జీఓల సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు మానసికంగా వత్తిడికి గురవుతున్నారని, అనేకమంది ఉద్యోగులు ఈ మహమ్మారి వ్యాధి బారిన పడి ప్రాణాలు కోల్పోతుండడం అందరికీ ఆవేదన కలిగిస్తోందని అన్నారు. కోవిడ్ నివారణకు ఫ్రంట్‌లైన్ల వారియర్లతో సమానంగా అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు వారి కుటుంబసభ్యులకు కోవిడ్ వ్యాక్సిన్ అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏనుగు రమణారెడ్డి, వై.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ సెంటర్ యువకుల అన్నదానం

కరోనా నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు సంగంలోని శివాజీసెంటర్ యువకులు దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నారు. కర్ఫ్యూతో హోటళ్ళు, దుకాణాలు మూసివేస్తుండడంతో సమయానికి అన్నం దొరక్క అనేకమంది యాచకులు, పాదచారులు ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన యువకులు ఈ కార్యక్రమం ప్రారంభించారు. సంగం పోలీసుల సహకారంతో అందరికీ అన్నం ప్యాకెట్లు అందజేశారు.

# ప్రజల సమస్యలు తీర్చడమే ధ్యేయం

**- ఆర్‌ఓ ప్లాంట్‌ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రసన్న**




ప్రజల సమస్యలు తీర్చడమే ధ్యేయంగా తాను కృషి చేస్తున్నానని, నియోజక వర్గంలో ఎక్కడ తాగునీటికి ఇబ్బందులు ఉన్నా ఆ కష్టాలు తీర్చేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నానని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న అన్నారు. కోవూరు మండలంలోని ఇనమదుగు, కొత్త దళితవాడ, గంగవరం, శ్రీనివాసపురం గిరిజనకాలనీ ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్‌ఓ ప్లాంట్లను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి విజయడెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో కలసి ఈ నెల 24న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ల నిర్మాణానికి నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 9 లక్షల రూపాయలను మంజూరుచేశారని, ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో ఈ ప్లాంట్‌లను నెలకొల్పుతామని చెప్పారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వైకాపా గంగవరం నాయకుడు యెడెం తిరుపతిరెడ్డి నివాసానికి వెళ్ళి ఆయన్ను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో డిఏఏబి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, తహశీల్దార్ సుబ్బయ్య, ఏఎంసి ఛైర్‌పర్సన్ ప్రమీలమ్మ, నాయకులు నలుబోలు సుబ్బారెడ్డి, గండవరపు వసంత కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రసన్నలక్ష్మి, ప్రమీలమ్మ, ఉప సర్పంచ్ మోషే, ఎంపిడిఓ శ్రీహరి, డిఇ లీలాప్రకాష్ పాల్గొన్నారు.

# పేదలకు అండగా ప్రభుత్వం

- **సిఎం సహాయనిధి నుంచి 45.55 లక్షలు వచ్చాయి**

**- వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి**



వెంకటగిరి నియోజకవర్గంలోని 73 మంది పేద కుటుంబాల వారికి సాయంగా సిఎం సహాయనిధి నుంచి 45.55 లక్షల రూపాయలు వచ్చాయని, పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారికి ఈ నిధులు మంజూరయ్యాయని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని, ఈ కరోనా కష్టకాలంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## నలుగురు ఎస్ఐల బదిలీ

జిల్లాలో నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఈనెల 25వ తేదిన జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఉత్తర్వులు జారీ చేశారు. దొరవారిసత్రం ఎస్ఐ సుధాకర్‌రెడ్డిని చిల్లకూరుకు, చిల్లకూరులో పనిచేస్తున్న ఎం.బాబీని జిల్లా విఆర్‌కు, విఆర్‌లో ఉన్న జి. ప్రభాకర్‌రెడ్డిని కావలి రూరల్‌కు, అక్కడ పనిచేస్తున్న జె.మాల్యాద్రిని జిల్లా విఆర్‌కు బదిలీ చేశారు. వీరు వెంటనే విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో ఎస్పీ ఆదేశించారు.

# ఆనందయ్య మందుపై గందరగోళం తగదు

**సిపిఐ నాయకుడు నారాయణ హితవు**



ఆనందయ్య ఇస్తున్న ఆయుర్వేద మందుపై కొన్ని కార్పొరేట్ శక్తులు లేనిపోని గందరగోళం చేయడం తగదని సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ హితవు పలికారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా విలయతాండవం చేస్తుంటే మన తెలుగువాడైన ఆనందయ్య కరోనా నివారణకు మందు తయారుచేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని ఆయుర్వేద వైద్యుడు ఆనందయ్య కోరోనా నివారణకు ఉచితంగా మందు ఇస్తుంటే, దాన్ని వేసుకున్నవారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నప్పుడు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు. ఆ మందు వేసుకున్నవారికి ఎలాంటి ప్రాణాపాయం లేదంటూ ఆ మందును ప్రజలు కోరుకుని కరోనా నుంచి బయటపడుతుంటే ఇక అనవసర రాద్ధాంతాలెందుకన్నారు. ఈనెల 23న ఆయన స్వయంగా కృష్ణపట్నానికి వెళ్ళి ఆయుర్వేద మందు తయారుచేసేందుకు వాడుతున్న వనమూలికలను ఆయన పరిశీలించారు. వాటివల్ల ప్రజలకు ఏమైనా ప్రాణహాని కలిగిందా అనే విషయమై ఆరాతీశారు. స్థానిక ప్రజలు కూడా ఈ మందుపట్ల సానుకూలంగా మాట్లాడారని ఆయన చెప్పారు. భారత ప్రజలకు ఆయుర్వేదం కొత్త కాదని, ప్రకృతి వనమూలికలతో ఆనందయ్య కరోనా నిర్మూలనకు మందు తయారుచేస్తే అభినందించాల్సింది పోయి మందు తయారీని నిలిపేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ విషయమై వెంటనే నిర్ణయం తీసుకోవాలన్నారు.

### ఉప రాష్ట్రపతి స్పందన శుభ పరిణామం

ఆనందయ్య మందుపై భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆయుర్వేదం స్పందించడం ఎంతో శుభపరిణామమని నారాయణ అన్నారు. ఆనందయ్య మందు అనేక మంది కరోనా బాధితులను ప్రాణాపాయం నుంచి రక్షించిందని, వారంతా ఇప్పుడు ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నారని, ఆయుర్వేదం ప్రజల ఆరోగ్యానికి మంచి చేస్తుందే తప్ప చెడు చేయదని ఆయన అన్నారు. ఇకనైనా ఆయుష్ అధికారుల సమక్షంలో ఈ మందు తయారీకి అన్ని వసతులు ఏర్పాటుచేసి ఆనందయ్య మందు తయారీకి ప్రభుత్వం అన్ని విధాలా సహకరించాలన్నారు.

# జర్నలిస్టులకు ఆయుర్వేదం మందును అందజేయండి

**కాకాణికి జర్నలిస్టు సంఘం నాయకుల వినతి**

కరోనా నివారణకు కృష్ణపట్నం ఆనందయ్య ఇస్తున్న ఆయుర్వేదం మందును జర్నలిస్టులకు కూడా ఇప్పించేందుకు సహకరించాలని జర్నలిస్టు సంఘాల నాయకులు ఏ.జయప్రకాష్, వి.వెంకటేశ్వర్లు ఒక లేఖలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఇటీవల విజ్ఞప్తి చేశారు. ఆనందయ్య కరోనా మందు విషయంలో తెలుగు రాష్ట్రాల నుంచే కాక అనేక ప్రాంతాల జర్నలిస్టులు ఆ మందు కావాలని ఫోన్లు చేస్తున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో పత్రికారంగంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నవారు 86 మంది దాకా మృతిచెందారని వారు పేర్కొంటూ, జర్నలిస్టులకు వారి కుటుంబసభ్యులకు కృష్ణపట్నం కరోనా మందును అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే కాకాణి సానుకూలంగా స్పందించారని, ఆ మందుకు సంబంధించి పరిశీలనలు పూర్తయిన తరువాత జర్నలిస్టులందరికీ కృష్ణపట్నం మందును అందజేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## వనమూలికలు పంపుతాం..

# మాకూ ఆ మందు ఇవ్వండి

**ఆనందయ్యను కోరిన మాగుంట శీనయ్య**



మీకు కావాల్సిన వనమూలికలు పంపుతాం.. మా జిల్లా ప్రజలకు కూడా కోవిడ్ నివారణ మందు పంపిణీ చేయండి' అని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆనందయ్యను కోరారు. ఇటీవల ఆయన కృష్ణపట్నానికి వెళ్ళి ఆనందయ్యను కలిశారు. ఆయన తయాచుచేస్తున్న మందును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని నల్లమల అడవుల్లో మీరు తయారుచేస్తున్న మందుకు అవసరమైన మూలికలు, వస్తువులు పుష్కలంగా దొరుకుతాయని, వాటిని మీకు సరఫరా చేసేందుకు సహకరిస్తామని, అదేవిధంగా ప్రకాశం జిల్లాలోని కోవిడ్ వ్యాధిగ్రస్తులకు కూడా మీరు ఆ కరోనా నివారణ మందు పంపిణీ చేయాలని ఆనందయ్యను కోరగా దానికి ఆనందయ్య అంగీకరించారని శీనయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆనందయ్యతో కలసి ఆయన అక్కడి ఆయుర్వేద మందుల తయారీ కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఆనందయ్య మొదటనుండి ఆయుర్వేద నాటు మందులను ఉచితంగా ప్రజలకు అందిస్తూ ఉండడం చాలా సంతోషదాయకమైన విషయమన్నారు. వారం రోజులనుండి కరోనా వ్యాధిగ్రస్తులకు కూడా ఆయన ఈ మందు వాడడం, దానిపై మంచి ఫలితాలు రావడం, ఇతర రాష్ట్రాల వారు మరియు జిల్లాల నుండి కోవిడ్ వ్యాధిగ్రస్తులు వేలాదిమంది ఆయన మందుల కొరకు రావడం జరిగిందన్నారు. దానిపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో సంప్రదించి ఈ మందుపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని కోరారని తెలిపారు. కేంద్రంలోని ఐసీఎంఆర్ వారు దీనిని సర్టిఫై చేస్తే అప్పుడు ఆనందయ్య మందు ప్రతి ఒక్కరికీ అందుబాటులో తీసుకురావడానికి వీలుగా ఉంటుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచిస్తున్నారని, ఈ విషయంలో ఎమ్మెల్యే కాకాణి పూర్తిగా నిమగ్నమై లక్షలాది మందికి ఈ మందును అందుబాటులోకి తీసుకురావాలని కృషిచేస్తున్నారని తెలిపారు. ఈ మందు వల్ల ఎటువంటి కెమికల్ రియాక్షన్‌లు కనబడలేదు కాబట్టి ఢిల్లీలోని ఆయుష్ మరియు ఐసీఎంఆర్ వారు ఆయన మందులను పరిశీలించి వాటిని ఎటువంటి ఇబ్బంది లేనివిధంగా ప్రజలకు అందించాలని ఆయన కోరారు.

# బాధితులకు జనసేన సాయం



కరోనాతో బాధపడుతూ హోమ్ ఐసోలేషన్‌లలో ఉంటూ భోజనానికి అవస్థలు పడుతున్నవారికి, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న పేదలకు ఆహారం అందిస్తూ పలువురు దాతలు తమ సేవాభావం చాటుకుంటున్నారు. జనసేన నాయకులు పవన్‌కల్యాణ్, మనుక్రాంత్‌ల పిలుపుతో నెల్లూరులోని జనసేన ఆధ్వర్యంలో గత పదిరోజులుగా దాదాపు 3వేల మందికి ఆహారం అందించినట్లు వారు పేర్కొన్నారు. మిత్రులు లింగారెడ్డి తదితరులు సహకరించారని, జనసేన నాయకులు గునుకుల కిషోర్, దుగ్గిశెట్టి వెంకట సుజయ్, ప్రశాంత్‌గౌడ్, కోటా బాలాజీ, చిత్తూరు బాలాజీ, కళ్యాణ్, గణేష్ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.







# మాస్కులు ఎందుకు పెట్టుకోవాల్సి వస్తున్నదంటే...!

మాట. మాట్లాడడం మనిషికి మాత్రమే దేవుడిచ్చిన వరం. జలచరాలు కానీ... పశు పక్ష్యాదులు గానీ... సకల చరాచర జంతుజాలం గానీ... అవి ఎంత క్రూరమైనవి అయినా సరే..., మాట్లాడలేవు. నీటిలో ఉండే మొసలి అయినా....అడవిలో ఉండే సింహమైనా...కేవలం శబ్దం మాత్రమే చేయగలవు. ఆ శబ్దాలకు మనం వేరు వేరు పేర్లు పెట్టుకున్నాం. అది వేరే విషయం.

కానీ...మనం అలా కాదు. మాట్లాడతాం. అందుకు నోటిని వాడతాం.ఆ నోటిని ఎన్ని రకాలుగా వాడగలమో...దానిని మనకిచ్చిన వాడికి కూడా తెలియనంతగా వాడుతున్నాం. అలా ఎన్ని వందల, వేల ఏళ్ల నుంచి వాడుతున్నామో మనకే గుర్తులేకుండా పోయింది.

సరదాగా...అలా ఓ పోలీస్‌స్టేషన్‌కు వెడితే.... అక్కడ ఉన్నవారు నోటిని ఎన్ని రకాలుగా వంకర్లు తిప్పుతున్నారో చూడవచ్చు. ఓ సగటు గృహస్థు ఇంటి వద్దకు వెళ్లి, గోడపక్కన కాసేపు నక్కి కూర్చుంటే...., ఆ భార్యాభర్తలు...లేదా....ఆ ఇంటి లోని అత్తా కోడళ్లు నోటిని ఎంత వినసొంపుగా వాడుతున్నారో వినవచ్చు. ఓ వీధి కుళాయి వద్దకు వెడితే.... నీటి కోసం అక్కడచేరిన అమ్మలక్కలు నోటిని ఎలా ప్రళయ తాండవమాడి స్తారో విని, చూసి తనివితీరా ఆనందించవచ్చు. ఓ కోర్ట్ హాల్లో కాసేపు కూర్చుందాం రండి....ఎన్ని నోళ్లు ఎన్ని అబద్ధాలు ఆడుతున్నాయో విని...''ఔరా!''అనుకుంటూ తరించవచ్చు. మనకు తెలిసిన చిల్లర మల్లర పొలిటీషియన్లు, ఆకురౌడీలు, రౌడీషీటర్లు, పైనుంచి ఓ రెండు మూడు చొక్కా గుండీలు ఊడదీసుకుని, బోర విరుచుకుంటూ(మెళ్లో ఓ బంగారపు పలుపుతాడు) వీధుల్లో తిరిగే ఆవారాలు, పోరంబోకులను ఓసారి పలకరించి చూడండి. వారు తమతమ నోళ్ళను వాడే విధానం చూసి ముక్కున వేలేసు కోవలసిందే. ముక్కు కూడా మూసు కోవలసిందే.






పోనీ యూట్యూబ్‌లోకి వెళ్లి... రాజకీయ పార్టీల అనుబంధేశ్వర రావులు.. తమ, తమ పార్టీ ప్రత్యర్థులపై తమ నేతలను మించి మరీ నోరు చేసుకుంటున్న తీరు చూడండి. ఇందుకా... గుగులోడు ఈ యూట్యూబు కని పెట్టింది అనిపిస్తుంది. టిక్కెటిచ్చి, గెలిపించిన వైసీపీపైన..., సీఎం జగన్‌పైన ఎంపీ రఘు రామకృష్ణరాజు నోరు పారేసుకుం టున్న తీరు చూస్తుంటే, దేవుడు ఆయనకు నోరు ఇచ్చింది ఇందుకా అనిపించక మానదు. అలాగే, రఘు రామకృష్ణరాజుపై ఓ మహిళామణి నోరు చేసుకున్న తీరును యూట్యూబ్‌లో చూసిన పలువురు 'అమ్మో... నీకో దణ్ణం. నీ నోటికో దణ్ణం...!' అంటూ సిగ్గుపడిపోయారు.

పోనీ...మామూలు జనం.., చదువు సంధ్యలు లేని జనం... పొట్టకూటి కోసం నానాపాట్లూ పడాల్సివస్తున్న వాళ్ళు...నోటిని ఎలాపడితే అలా వాడక కుదరదం లేదని సర్దిచెప్పుకున్నప్పటికీ మన గౌరవ ప్రజాప్రతినిధులు వగైరాలు నోటిని వాడుతున్న తీరు చూస్తున్నవారికి వీళ్లకు నోరెందుకు ఇచ్చాడ్రా దేవుడు అనిపిస్తుంది.

మొన్ననే బెంగాల్ ఎన్నికలు ముగిశాయి. చేయాల్సిన పనులు చేయాల్సిన వారు...అవి చేయకుండా... మోకాళ్ళ దాకా గెడ్డాలూ మీసాలూ పెంచేసి నోటిని ఎలా వాడారో చూశాం.

ఇక్కడ, మన దగ్గర అనేకాదు. అమెరికాలో ట్రంప్ అనే ఆసామి కూడా నోటిని వాడుతున్న తీరు చూసి, అక్కడి జనం భయపడిపోయి, ఇంటికి పంపించేశారు.

క్రూర జంతువులకు కూడా లేని మాట్లాడే శక్తిని మనుషుల కిస్తే... ఎంతగా దుర్వినియోగం చేస్తున్నారో గదా అని చింతించిన ప్రకృతమ్మ ఇక నోటికి తాళం వేయక తప్పదన్న నిర్ణయానికి వచ్చిన ఫలితమే ఈ మాస్క్.

''వీలైనంత వరకు మాట్లాడకండి. తినడానికీ, తాగడానికీ మాత్రమే నోరు వాడండి. మాట్లాడడానికి నోరు తెరిచారో...మీ నోట్లోని తుంపర ఎదుటివారి మోహం మీద... ఎదుటివారి నోటి తుంపర మీమీద పడి..., ''పోతారు..'' అంటూ వార్నింగ్ ఇచ్చింది. ఉత్తుత్తి వార్నింగ్‌లను మనం కేర్ చెయ్యమని ప్రకృతమ్మకు తెలుసు కదా!.అందుకని చైనాను అడిగి, ఊహాన్‌లోని ఒక ల్యాబ్‌లో తయారుచేసి ఉంచిన ఓ వైరస్‌ను(మూడో ప్రపంచ యుద్ధం వస్తే, పనికి వస్తుందని... పాపం చైనా దీనిని దాచిపెట్టి ఉంచుకుంది) మొత్తం మానవాళి నోటిలో పెట్టేసింది.

దీనితో...దేశాలకు దేశాలు,ఖండాలకు ఖండాలు తాళాలు వేసుకుని, తలుపులు బిడాయించుకుని ఇళ్లల్లో ఉండిపోయాయి. వ్యాపారాలు, వ్యాపకాలు, ఉద్యోగాలు, ప్రయాణాలు, ప్రేమలు, ముద్దులు, పెళ్లిళ్లు, శోభనాలు, తద్దినాలు,విందులు, వినోదాలు, ఊరేగింపులు, మత ప్రచారాలు, మన ప్రధాని విదేశీ పర్యటనలు, విమానాలు, రాజకీయాలు...

ఒకటేమిటి? మొత్తం అన్నీ బంద్ అయిపోయాయి. అష్ట దిగ్బంధనం అయిపోయాయి. నాలుక అవసరం ఉన్న ప్రతి పనీ ఆగిపోయింది.ఇన్నాళ్లూ ఇష్టం వచ్చినట్టు ఆడించిన నాలుకకు దిక్కూ మొక్కూ లేకుండా పోయింది.

అంతెందుకు...! మన సారుని చూడండి. గత పదిహేను, పదహారేళ్లగా నాలుకను ఎంత ఆడించారు!? రాజకీయ ప్రత్యర్థులపై నోటితోనే విరుచుకుపడ్డారు. నోరేసుకుని దేశం మొత్తం ఆ మూల నుంచి ఈ మూలకు కాళ్లకు విమానాలు, హెలికాప్టర్లు కట్టుకు తిరిగారు. రాహుల్ గాంధీని, వాళ్ళమ్మ గారిని నోటితోనే ఊచకోత కోశారు. ''భారతీయ'' సంస్కృతి, సంప్రదాయాల పరిమళాలను విదేశాల్లో వెదజల్లడం కోసం చెడతిరిగారు. ఏరోజుకారోజు ఫ్రెష్‌గా.. నవనవలాడే లేత వంకాయలాగా కనిపించడం కోసం వేసిన డ్రెస్సు వేయకుండా ఓ నాలుగైదు లారీల డ్రెస్సులు వేసుకు మరీ తిరిగారు.

సందర్భం ఏదైనాసరే... ఏ సభలో అయినా సరే... ఆయన అసువుగా.... కాగితం చూసుకోకుండా మాట్లాడు తుంటే ఆయన ప్రత్యర్థులు సైతం నిబిడాశ్చర్యంలో మునిగిపోయారు. నోటి మాట రాక నిరుత్తరులైపోయారు. (సోనియా గాంధీ అయితే సభికులను ఉద్దేశించి... బాగున్నారా అనడానికి కూడా కాగితం చూడాల్సిందే). దేశంలో ఎన్నికలు ఏ రాష్ట్రంలో జరిగినా కూడా ఆయన తన నాలుక చేసే విన్యాసాలతో సభికులను ఎంత రంజింప చేస్తూ వచ్చారు!

లేటెస్ట్‌గా బెంగాల్‌లో ఆయన నాలుక ఎంతగా ఆడించినా మమతా బెనర్జీ నాలుక ఇంకా పదునైనది, తాటిమట్ట లాగా బాగా గరుకైనది కావడంతో వర్క్ ఔట్ కాలేదు. అది వేరే విషయం. మరి, అటువంటి సారును ఇప్పుడు చూడండి. ఆయన్ను చూస్తుంటే అసలు నోట్లో నాలుక ఉన్నదా...లేదా అన్న సందేహం కూడా కలుగుతున్నది. నోటికి మాస్క్ వేసేశారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినప్పటికీ ఆయన నోరు తెరవడం లేదు. కళ్ళతో మాత్రమే చూస్తున్నారు. తెరవాల్సి వచ్చినప్పుడు మాత్రం, కళ్ళంట నాలుగు చుక్కలు రాలుస్తున్నారు.

ఆయనను చూస్తుంటే(టీవీలలో...) రామాయణం రాసిన వాల్మీకి మహర్షియో... లేక, మహాభారతం రాసిన వ్యాస భగవానుడో మన కళ్ళ ముందు సాక్షాత్కరించారనే భక్తి భావం కలుగుతున్నది. 'నోరు తెరిచారో.... తుంపరలే...' అని వైద్యులు, శాస్త్రవేత్తలూ హెచ్చరించడం వల్ల కూడా మన వ్యాస మహర్షి నోరు తెరవడం లేదేమో..!

అసలు మాటకు ఇంత పవర్ ఉన్నదని... నెల్లూరు నగరానికే చెందిన విద్యత్కవి 'చిన్ని' నారాయణరావు ఏకంగా ఓ పుస్తక రూపంలో రాసిన ఓ 'పెద్ద' కవిత చదివేదాకా తెలియలేదు. తెలిసేసరికి.... మాట పడిపోయింది.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# పని చేయని బోర్లు.. అన్నిటికీ రిపేర్లు

గూడూరు పురపాలక సంఘం పరిధిలో 34 వార్డులున్నాయి. రమారమి 400బోర్లు ఉండగా సగానికిపైగా పనిచేయడం లేదు. కొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి నిరుపయోగంగా, మరికొన్ని చోట్ల చిన్నపాటి మరమ్మతులకు గురై అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రజల తాగునీటి అవసరాలకు ఏటా లక్షల రూపాయలు వెచ్చించి కొత్త బోర్లు తవ్వుతున్నా, సమస్య మాత్రం పరిష్కారమవుతున్న దాఖలా లేదు. బోర్లను బాగుచేయడానికి పెద్దమొత్తంలోనే ఖర్చుచేస్తున్న అధికారులు సత్ఫలితాలు రాబట్టడంలో విఫలమవుతున్నారు. మరమ్మతులు పూర్తయిన చేతిపంపుల పనితీరు మూణ్ణాళ్ల ముచ్చటగానే ఉంది.



## గూడూరు డివిజన్ వార్తలు

# త్వరితగతిన వైఎస్సార్ బీమా నమోదు



ఇన్‌ఛార్జి కమిషనర్ రఘుకుమార్

గూడూరు పురపాలక సంఘంలోని అర్హులందరికీ వైఎస్సార్ బీమా వర్తింప చేసేందుకు వీలుగా త్వరితగతిన నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఇన్‌ఛార్జి కమిషనర్ రఘుకుమార్ తెలిపారు. గూడూరు పురపాలక సంఘ కార్యాలయంలో వార్డు సచివాలయాల సంక్షేమ సహాయకులతో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ నెలాఖరుతో బీమా నమోదు గడువు ముగుస్తుందని చెప్పారు. బీమా, జగనన్న తోడు, పీఎం స్వానిధి తదితర పథకాలు అర్హులకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెప్మా సిటీ సెషన్ మేనేజర్ బి.కాంతయ్య, సిబ్బంది హాజరయ్యారు. కాగా గూడూరు పట్టణంలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపడు తున్నారు. పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ రఘుకుమార్ ఆధ్వర్యంలో వీధుల్లో సోడియం హైపోక్లోరైడ్ ద్రావకం పిచికారి చేశారు. కరోనా నియంత్రణకు పురప్రజలు సహకరించాలని కోరారు. ఇంట్లోనుంచి బయటకు వస్తే విధిగా మాస్కు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఆర్ఓ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# డా.రోహిణి పుట్టినరోజున సేవా కార్యక్రమాలు



గూడూరులోని డా.సి.ఆర్.రెడ్డి హాస్పిటల్స్ అధినేతలు ప్రముఖ వైద్యులు డా.జనార్దన్ రెడ్డి సతీమణి ప్రముఖ వైద్యురాలు డా.రోహిణమ్మ పుట్టినరోజును సార్థకం చేసుకుంటూ ఇటీవల పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గూడూరులోని ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సేవాసంస్థల ఆధ్వర్యంలో గిరిజనకాలనీ ప్రజలకు ఫలసరుకులు పంపిణీ చేశారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ రఘుకుమార్ చేతులు మీదుగా పారిశుధ్య కార్మికులకు గ్లౌజ్‌లు, మాస్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఓ కృష్ణారెడ్డి, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, జీవని, స్నేహలత, అనిత, విష్ణువందన, జమునమ్మ, నారాయణరెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవలు అభినందనీయం

◆ నెల్లటూరు సచివాలయం వాలంటీర్లకు సన్మానం



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన వాలంటీర్ల వ్యవస్థలో వాలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని నెల్లటూరు సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. గ్రామంలోని వాలంటీర్లకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సన్మానం చేసి వారికి ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే ప్రోత్సాహక బహుమతిగా పదివేల రూపాయలను అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు వలన ప్రభుత్వం ఏర్పాటుచేసిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సత్వరం లబ్ధిదారులకు అందేలా దోహదపడుతున్నాయని, అలాగే అర్హులు ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా వుంటే వాలంటీర్ల ద్వారా వాటిని తెలుసుకుని సత్వరం వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వాలంటీర్ల వ్యవస్థ ఎంతో ప్రయోజనకరంగా ఉందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆ గ్రామ వాలంటీర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కోటి, మహిళా పోలీస్ ప్రియాంక, ఏఎన్ఎం శశిదేవి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

# నవాబుపేటలో విషజ్వరాలు.. పట్టించుకోని అధికారులు



వాకాడు మండలం నవాబుపేటలో ఆరోగ్య అత్యయిక స్థితిని ప్రకటించాలని ఇన్సాఫ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్ పేట ప్రాంతంలో వారు సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామంలో విషజ్వరాలు ప్రబలి అనేకమంది మంచాన పడ్డారని చెప్పారు. మండల కేంద్రానికి 40 కి.మీ.ల దూరాన ఉండటంతో ఈ గ్రామాన్ని సందర్శించే నాథులే లేరన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణం వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు.

# విలన్‌గా రాజనాల నటన అపూర్వం

## వర్ధంతి సభలో వక్తలు



విలన్‌గా నటించడంలో ప్రఖ్యాత రంగస్థల, సినీనటుడు రాజనాల నటన అపూర్వమని, విలనీలో తెలుగు సినిమా రంగానికే ఆయన ప్రఖ్యాతిని తెచ్చారని, ఆయన కావలి వాసి కావడం కావలి ప్రజలకే కాక, సింహపురిసీమకు, ప్రతి తెలుగువాడికి గర్వకారణమని వక్తలు కొనియాడారు. ఇటీవల కావలి రెడ్‌క్రాస్ భవనంలో రాజనాల వర్ధంతి సభ ఎంతో ఘనంగా జరిగింది. రాజనాల కళాపీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది రాజనాల అభిమానులు, కళాకారులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాజనాల నటనా వైభవాన్ని ప్రశంసించారు. తెలుగు సినీ హీరోలుగా ఉన్న ఎన్టీఆర్, ఏఎన్ఆర్ తదితరులతో ప్రతినాయకునిగా నటించినా, వారితో పాటు సమానమైన పారితోషికం అందుకున్న మహానటుడు రాజనాల అని వక్తలు పేర్కొన్నారు. రాజనాల సినిమారంగంలో విలన్‌గా నటించినా నిజజీవితంలో ఎందరో పేద కళాకారులను ఆదుకుని రియల్‌హీరోగా అందరి అభిమానం పొందారన్నారు. రాజనాల ఎప్పుడు కావలికి వచ్చినా కలుగోళ శాంభవిమాతను దర్శించుకుని వెళ్ళేవారని వారు గుర్తుచేసుకున్నారు. తొలుత రాజనాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కళాపీఠం గౌరవాధ్యక్షుడు కనమర్లపూడి కోటేశ్వరరావు, అధ్యక్షుడు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, పివిఎస్ ప్రసాద్, పద్మావతి, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారికి ఈనెల 23న ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్టుకు అభిషేకం చేసి, శోభాయ మానంగా అలంకరించి విశేష పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కోవిడ్ నిబంధనలతో అమ్మవారికి ఆలయంలో ఏకాంతంగా నిత్యసేవలు, పూజలు చేస్తున్నారు.

# కాకాణితో వైకాపా ప్రజారోగ్య బృందం భేటీ



ముత్తుకూరు మండలం కృష్ణ పట్నం గ్రామంలో కరోనా నివార ణకు ఆనందయ్య ఇస్తున్న మందును వైకాపా ప్రజారోగ్య బృందం పరిశీ లించింది. అనంతరం ఆ బృందం సభ్యులు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో భేటీ అయ్యారు. ప్రజలనుంచి సేకరించిన అభి ప్రాయాలు, మందు ప్రభావం, అన్ని ప్రాంతాలకు మందును పంపాలంటే ఏ రూపంలో తయారు చేయాలి, ప్రజారోగ్య విభాగం అందించే సహకారంపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యం విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ అన్నపరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, డి.వేణుగోపాల్‌రెడ్డి, పి.శ్రీనివాసచౌదరి, సాయిప్రియ, విజయకుమార్‌లు పాల్గొన్నారు.

# కోవిడ్ కట్టడిలో ప్రభుత్వం విఫలం

## బిజెపి నిరసనలు

కరోనా కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ ఇటీవల జిల్లా వ్యాప్తంగా భాజపా నాయకులు, కార్య కర్తలు ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నెల్లూరు నగరంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి నాయకుడు భరత్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఎన్నికలపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలపై లేదని ఆరోపించారు. కరోనా బారినపడిన వారికి ఆసుపత్రుల్లో బెడ్లు, ఆక్సిజన్, మందులు లేవని, అవన్నీ బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయాయని విమర్శిం చారు. కార్యక్రమంలో భాజపా నాయకులు సునీల్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి ఉద్యోగి సేవాభావం

## 50వ సారి రక్తదానం చేసిన రవికుమార్




ఆర్టీసిలో పని చేస్తున్న ఓ ఉద్యోగి బాధితులను ఆదుకునేం దుకు రక్తదానం చేస్తూ తన సేవా భావం చాటుకున్నాడు. కావలి ఆర్టీసి డిపో మేనేజర్ కార్యా లయంలో జూనియర్ సహాయకునిగా పనిచేస్తున్న కొర్లు రవికుమార్ ఇటీవల కావలి రెడ్‌క్రాస్ రక్తనిధిలో 50వ సారి రక్తదానం చేయడంతో రవి కుమార్‌ను అందరూ అభినం దించారు. గత ఏడాది కరోనా సమయంలో అనేకమంది వలస కార్మికుల కుటుంబాలకు ఆహారం అందజేశారని, కావలిలో రక్తనిధిని ప్రారంభించినప్పటి నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆయన రక్తదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా ఉంటున్నారని పలువురు ప్రశంసించారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు డి.రవిప్రకాష్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరిరెడ్డి, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, కనమర్ల పూడి వెంకటనారాయణ, ఆర్టీసి అసిస్టెంట్ మేనేజర్ ఆర్.ఎస్ లక్ష్మి తదితరులు రవికుమార్‌ను అభినందించారు.

# ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి గడువు పెంపు

జిల్లాలోని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో 2021-22 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకు నేందుకు గడువు జూన్ 30 వరకు పొడి గించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముజీబుర్ రెహమాన్ తెలిపారు. విద్యా ర్థులు జూన్ 30వ తేదీ సాయంత్రం లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు www.cse.ap.gov.in/apms.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

# కరోనా బాధితులకు మందులు, భోజన వసతి

## వెంకటగిరిలో కవచ చారిటబుల్ ట్రస్ట్ సేవలు



కరోనా బాధితులకు వెంకటగిరి లోని కవచ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మందులు, భోజన వసతులు కల్పిస్తూ వారు తమ సేవాభావం చాటుకుంటు న్నారు. ఇటీవల వెంకటగిరిలోని మల్లమ్మగుడి వీధి ప్రాంతంలోని పలు నిరుపేద కుటుంబాలకు వారు ఈ సేవలందించారు. కోవిడ్ సోకినవారు తమ ట్రస్టుకు సమాచారం పంపితే వారికి మందులు, భోజనవసతి ఉచితంగా సమకూరుస్తామన్నారు. ఆ ట్రస్టు ఛైర్మన్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ కోవిడ్‌ను ధైర్యంగా ఎదుర్కోవాలని, కరోనాను నియంత్రించేందుకు ప్రభుత్వాలు సూచించిన నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రమేష్, ఉమామహేశ్వరరావు, సాయితేజ, అంకయ్య, మధు, హరీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహా శక్తిదేవత.. విడవలూరు అంకాళీమాత

***త్రిశక్తి స్వరూపిణి అయిన దుర్గామాత కాళికాదేవి రూపంలో కూడా అవతరిం చింది. ఆ కాళికాదేవి మరిన్ని రూపాలతో భువిపై ఆవిర్భవించి భక్తాదులను అన్ని రకాల కష్టాల నుంచి ఆదుకుంటూనే ఉంది. అలాంటి కాళీమాత వేనవేల అవతార రూపాల్లోని ఒక రూపమే నెల్లూరుజిల్లాలోని విడవలూరులో ఉన్న అంకాళీమాత(అంకమ్మ)గా భక్తులు అనాదిగా పూజలు చేస్తున్నారు. విడవలూరు గ్రామదేవతగా కూడా అంకాళమ్మ అమ్మవారు ప్రసిద్ధి. అమ్మవారి ఆలయ ఆవిర్భావం వెనుక ఒక ఆసక్తికరమైన కథనం కూడా ఉంది.***

కొన్ని దశాబ్దాల క్రితం.. విడవలూరు సమీపంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో ఒక ఇంట్లో రాగుల బొట్లలో అమ్మ వారు ఆవిర్భవించినట్లు చెప్తుంటారు. వారింట్లో ఉన్న రాగులు ఎన్ని రోజులుగా తీస్తున్నా తరగకపోవడం గమనించి దానిని కుమ్మరించగా అందులో అంకాళీమాత విగ్రహం కనిపించిందట. దాంతో వారు ఆశ్చర్యపోయి అమ్మవారిని ఎక్కడ ప్రతిష్టించాలో తెలియక ఆలోచనలో పడగా, ఒకరోజు అమ్మవారు వారికి స్వప్నదర్శనంలో కనిపించి తనను విడవలూరులో ప్రతిష్టించా లని చెప్పిందట. అమ్మవారి ఆదేశం మేరకు గ్రామస్తులంతా కలసి ఆ మహిమాన్వితమైన విగ్రహాన్ని విడవలూరులో ప్రతి ష్టించినట్లు చెప్తుంటారు.

### అందరినీ కాపాడే చల్లనితల్లి.. అంకాళమ్మ

అంకాళమ్మ అమ్మవారు కాళికాదేవి అంశ అని, ఎంతో శక్తిగల దేవత అని, అందరినీ చల్లగా కాపాడేతల్లి అంకాళీమాత అని గ్రామస్తుల విశ్వాసం. అంతేకాదు, గ్రామాల్లో పంటలు పండకున్నా, ఏమైనా ఉపద్రవాలు వచ్చినా ఆ చల్లనితల్లికి మొక్కుకుంటే చాలు..ఆ బాధలన్నీ ఇట్టే నెరవేరుతాయని వారు ఘంటాపథంగా చెప్తున్నారు. శారీరకంగా వచ్చే బాధలకు, మానసిక రుగ్మతలు వగైరా ఏ బాధలున్నా కూడా అమ్మవారి








మన దేవాలయాలు (49)

అనుగ్రహంతో అవన్నీ తొలగిపోతాయి. విడవలూరు ప్రజలే కాక ఆ చుట్టుపక్కల ఉన్న సుమారు పద్నాలుగు గ్రామాల ప్రజలకు అంకాళమ్మ అమ్మవారే ఆరాధ్యదైవం. ఈ ఆలయాన్ని ఇటీవలి కాలంలో దాతలు, భక్తులు బాగా అభివృద్ధి చేశారు.

### అయిదురోజుల పాటు వైభవోపేతంగా తిరునాళ్ళ :

అంకాళమ్మ తిరునాళ్ళంటే అయిదురోజుల పాటు ఏకధాటిగా, ఎంతో వైభవోపేతంగా జరుగుతుంది. తొలి ఏకాదశి తర్వాత ఆదివారం, మంగళ, శుక్రవారాల్లో, ఆ తర్వాత వచ్చే సోమవారం, గురువారాల్లో అమ్మవారికి భక్తులు చలిపిండి, పానకం నైవేద్యంగా సమర్పించుకుంటూ ఉంటారు. అయిదు వారాలు అలా గడిచాక అమ్మవారికి పెద్దఎత్తున అయిదు రోజుల పాటు ఎంతో వైభవంగా తిరునాళ్ళ చేస్తారు. ఈ అయిదురోజులు అమ్మవారిని పులి వాహనంపై ఆశీనురాలిని చేసి గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. తిరునాళ్ళలో భాగంగా తొలిరోజున అమ్మవారి విగ్రహానికి ఎదురుగా ముగ్గురూపంలో అమ్మవారిని చిత్రించి అలంకరిస్తారు. పసుపు కుంకుమతో పాటు చీర జాకెట్, గాజులు వగైరాలన్నీ పెట్టి పూజలు చేస్తారు. రెండవరోజు అంకాళమ్మ తల్లి నాలుక రూపంలో దర్శనమిస్తారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుంటారు. మూడవ రోజున అయిదు అరివేణి కుండలను అలంకరించి గంగమ్మకు పూజలు చేశాక, ఆ కుండలను అర్చకులు పోలేరమ్మ మిట్ట వద్ద నుంచి తలమీద పెట్టుకుని మంగళవాద్యాలతో తప్పెట్లు తాళాలతో అంకాళమ్మ గుడిదాకా ఊరేగింపుగా తీసుకు వస్తారు. నాల్గవరోజు పోతు ఉత్సవం సందర్భంగా అమ్మవారి పుట్టిన ఊరైన అన్నారెడ్డిపాళెం నుంచి కావడులతో అమ్మవారికి పసుపు కుంకుమలు, పుట్టినింటి చీర సారెలు, అయిదు రకాల పిండివంటలు మోసుకువస్తారు. గ్రామపెద్దలంతా వచ్చి అమ్మ వారిని దర్శించుకుని 108 కొబ్బరికాయలు కొట్టి గ్రామాలన్నీ సుభిక్షంగా ఉండాలని మొక్కుకుంటారు. అయిదవ రోజు చుట్టు పక్కల ఉన్న తుమ్మగుంట, పార్లపల్లి, అలగానిపాడు గ్రామాల నుంచి అమ్మవారికి పసుపుకుంకుమలు తీసుకువస్తారు. ఈ సందర్భంగా విడవలూరులోని మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ, పోతురాజు ఆలయాలను కూడా పూల అలంకరణలతో విద్యు ద్దీపాలతో శోభాయమానం చేస్తారు. పెద్దసంఖ్యలో మత్స్యకారులు కూడా పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటారు. అనంతరం పారువేట సందర్భంగా ఆలయంలో అమ్మవారికి పూలంగిసేవ, విశేష సేవలు నిర్వహించి, అనేక రకాల నైవే ద్యాలు పెట్టి తలుపులు మూసివేస్తారు. మళ్ళీ మూడురోజుల తర్వాత తలుపులు తీసి, అమ్మవారికి పొంగళ్ళు పొంగించి నైవేద్యంగా సమర్పించుకుంటారు. ఇలా ఎంతో విశేషంగా జరిగే అంకమ్మ తిరునాళ్ళకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు.

# మాగుంట కుటుంబం సారథ్యంలో.. నెల్లూరు ఆహారప్రియులకోసం ముస్తాబవుతున్న







## అధునాతన మల్టి క్యూసైన్ రెస్టారెంట్

# స్పైస్ స్ట్రీట్

నెల్లూరులో మాగుంటోళ్లంటే కొత్తదనానికి మారుపేరు. అదే పేరును సార్ధకం చేసుకుంటూ ఇప్పుడు ఆహారప్రియుల కోసం అత్యంత అధునాతన మల్టిక్యూసైన్ రెస్టారెంటుని "స్పైస్ స్ట్రీట్" పేరుతో అందించబోతున్నారు. సరస్వతినగర్‌లోని మాగుంటోళ్ళ ఇంటికి ఎదురుగా సుమారు అరఎకరా స్థలంలో నిర్మితమవుతున్న ఈ రెస్టారెంట్ బహుశా మరో మూడు నాలుగు నెలల్లో నెల్లూరీయులకు అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకూ తమ సినిమాహాళ్లలో మాత్రమే రెస్టారెంట్లను నిర్వహిస్తూ వచ్చారు. ఇప్పుడు తొలిసారిగా ఒక పెద్ద ఫ్యామిలీ రెస్టారెంటుని నగరంలో ప్రారంభించ బోతున్నారు. సుమారు 450 నుండి 500 సీటింగుతో ఈ రెస్టారెంటులో సేవలందించనున్నారు. 500 మంది నుండి 700 మంది వరకు పాల్గొనే మీడియం సైజ్ వేడుకలు జరుపుకోవడానికి వీలుగా ఇండోర్, అవుట్ డోర్ వేదికలతో ఈ సముదాయాన్ని తీర్చిదిద్దుతున్నారు. స్వర్గీయ మాగుంట సుబ్బరామన్న మనుమడు జూనియర్ మాగుంట సుబ్బరామిరెడ్డి ఈ నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నాడు.










## కల్యాణ వైభవం...!




నెల్లూరులోని సీనియర్ సిటిజన్, ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు కోన వెంకట చలమయ్య - శకుంతలల మనుమరాలు, కోన వెంకట సాయి సుబ్బారావు - సరళల కుమార్తె **రిజుత - జశ్వంత్** (అళహరి వెంకట రమేష్ - పద్మావతిల కుమారుడు)ల వివాహం మే 22వ తేదీ నెల్లూరులోని వారి స్వగృహంలో వైభవంగా జరిగింది. వధూవరులను భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, ప్రధాని మోడీ, మాజీముఖ్యమంత్రి కె.రోశయ్య తదితర ప్రముఖులు తమ ఆశీస్సులు తెలియజేశారు. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# అనుమతులు రాగానే.. పంపిణీ చేస్తాం

### - ఆనందయ్యను కలసిన ఎమ్మెల్యే కాకాణి



ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు రాగానే కరోనా వైరస్ నివారణకు ఆనందయ్య ఇస్తున్న మందును పంపిణీ చేయడం ప్రారంభిస్తామని వైకాపా నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 25న ఆయన కృష్ణపట్నంలో ఆనందయ్యను కలసి పలు విషయాలపై చర్చించిన తర్వాత ఆయన మాట్లాడుతూ ఆనందయ్య ఆయుర్వేద మందుకు ప్రజల్లో మంచి డిమాండ్ ఉందని, ఆ మందును చాలా మంది కోరుకుంటున్నారని, మందు తయారీకి సిద్ధంగా ఉందని అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని కుటుంబాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అవసరమైన వారందరికీ ఆ మందు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మందుపై ప్రస్తుతం శాస్త్రీయత అంశంలో అధ్యయనం జరుగుతోందని, ఈలోగా మందు కోసం ఎవరూ కృష్ణపట్నం రావద్దని, అనుమతులు వచ్చిన తర్వాత అన్ని జిల్లాలతో పాటు, ఇతర రాష్ట్రాలవారికి కూడా ఆన్‌లైన్, పోస్టల్ ద్వారా మందును పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా కేంద్ర ఆయుష్‌శాఖతో ఈ మందుపై అధ్యయనం చేయాలని చెప్పివున్నారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆనందయ్య కూడా ఉన్నారు.

# 'సెంబ్‌కార్ప్' సేవలను అభినందించిన కలెక్టర్



సామాజిక బాధ్యతతో కోవిడ్ బాధితులను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన సెంబ్‌కార్ప్ కంపెనీ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు అభినందించారు. ముత్తుకూరు మండలం నేలటూరు వద్దనున్న సెంబ్‌కార్ప్ కంపెనీ ప్రతినిధులు రఘురామ్, అల్తాఫ్, ఆల్ భట్ ఈనెల 24న 40 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను, 2 వేల హోమ్ ఐసోలేషన్ కిట్లను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ బాధితులను ఆదుకుంటున్నందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో సుమారు 15 వేలమంది పాజిటివ్ పేషెంట్లు హోమ్ ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్య పరిస్థితిని ప్రతిరోజూ సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, వైద్య సిబ్బంది పర్యవేక్షించడంతోపాటు అవసరమైన మందులతో కూడిన ఐసోలేషన్ కిట్‌లను కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ల అవసరం చాలా ఉందన్నారు. వీటిని అవసరమైన ఆసుపత్రులకు, కోవిడ్ కేర్ సెంటర్లకు పంపడం జరుగుతుందన్నారు. జిల్లాలో 11 కోవిడ్ కేర్ సెంటర్లలో కూడా కోవిడ్ పాజిటివ్ పేషంట్స్‌కు చికిత్స అందిస్తున్నామని, చికిత్సలో భాగంగా వీరికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు ఎంతో ఉపయోగ‌డతాయన్నారు. కోవిడ్ కేర్ సెంటర్స్‌లో వెయ్యి మందికి తగ్గకుండా చికిత్స పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. కోవిడ్ కేర్ సెంటర్లను నిర్వహించేందుకు శ్రీహరికోట, జెన్‌కో, కృష్ణపట్నం వంటి పరిశ్రమలు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చాయని, ప్రభుత్వపరంగా అవసరమైన వైద్యసిబ్బందిని కేటాయిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కోవిడ్ లక్షణాలు తక్కువగా ఉన్న పాజిటివ్ పేషెంట్స్‌కు కోవిడ్ కేర్ సెంటర్స్ ఎంతో ఉపయోగంగా ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. పాజిటివ్ కేసుల్లో జిల్లాలో 98 శాతం రికవరీ రేటు నమోదు అయిందని, ఆక్సిజన్ లెవల్స్ 90 కంటే తక్కువ ఉన్న పాజిటివ్ పేషంట్స్ కోవిడ్ ఆసుపత్రుల్లో కానీ, కోవివ్ కేర్ సెంటర్లలో కానీ చికిత్స పొందాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కోవిడ్ ప్రోటోకాల్ ఖచ్చితంగా అమలుచేస్తూ లాక్‌డౌన్‌ను పటిష్టంగా అమలు చేయడం వలన కోవిడ్ పాజిటివ్ కేసులు క్రమేణా తగ్గుతున్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి పాల్గొన్నారు.

# ఆనందయ్య మందుకు అడ్డంకులా?



\- సోమిరెడ్డి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు రావాలంటూ కరోనాకు ఆనందయ్య ఇచ్చే మందు పంపిణీని అడ్డుకోవడం తగదని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో బొనిగి ఆనందయ్య మందు తయారీ చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టు ఇతర ప్రాంతాలలో మందు తయారీ నిలిపేసి బహిరంగంగా పేదలకు అందించాలన్నారు. ఔషధం పంపిణీని ప్రకటించాక వేలమంది వస్తే లాఠీఛార్జీ చేయడం దారుణమన్నారు. మందులో దుష్ప్రభావాలు లేవని చెప్పినా జాతీయ స్థాయి అంశాన్ని నీరుగార్చేశారని మండిపడ్డారు. అనధికారికంగా మందు తయారుచేయించుకోవడం ఆపాలని అన్నారు.

# న(యు)వ పాలనకు రెండేళ్ళు

(మొదటి పేజీ తరువాయి)

నాయకులకు సైతం అత్యంత ప్రాధాన్యత కల్పించి చాలామందికి మంత్రి పదవులుకూడా ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు ముఖ్యమంత్రి. కొంతమంది అమాత్యులు మొదటి ఏడాదిన్నర కాలంలో తాము మంత్రుల మయ్యామన్న సంగతి కూడా మర్చిపోయారు. అలవాటులో పొరపాటులా, మీసాలు తిప్పడం, తొడలు చరచడం, చొక్కాలు మడవడం, బూతు పారాయణాలు వల్లించడం, పాత్రికేయులకు వార్నింగ్‌లు ఇవ్వడం వంటి ఘన కార్యాలను బాగానే చేసి తమ సహజ నైజాన్ని బయటపెట్టుకున్నారు.

పురాణకాలాల్లో ఋషులు, మునులు శిష్యులకు విద్య, విలువలతో పాటు మంత్రాలు కూడా నేర్పించి వరాలు ఇచ్చేవారు. అదే సమయంలో నువ్వు పలాన చేయకూడని పనిచేస్తే ఈ మంత్రం ఇక ఎప్పటికి పనిచేయదు అంటూ ఒక మెలిక కూడా పెట్టేవారు. అదే తరహాలో రెండున్నర సంవత్సరాల కాలం పాటే మీరు మంత్రులుగా ఉంటారు.., ఆ తరువాత దైవాధీనమే అన్న ఒక మెలిక ముఖ్యమంత్రి పెట్టడంతో ఇప్పుడు ఒక్కొక్కరిలో మార్పు కనిపిస్తోంది. దూకుడు తగ్గింది, నోళ్లకు తాళం పడింది. రాజకీయాలు, వ్యక్తిగత దూషణలు, పగవారికి హెచ్చరికలు పక్కన పెట్టి పనిచేయడం మొదలు పెట్టారు. రెండున్నరేళ్ల గండం గట్టెక్కే పనిలో పడ్డారు.

ఇక ఆరు నెలలే వుంది. ఇప్పుడు వీళ్ళ పని తీరు చూపించాలి. ముఖ్యమంత్రి దగ్గర మార్కులు కొట్టెయ్యాలి. ఇప్పుడు చెయ్యి, నోరో, కాలు జారితే బొక్క బోర్లా పడతారు. జగన్మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో పదేపదే చెప్పిన మాట ఒక్కటే 'తనకు ఒక్క అవకాశం ఇవ్వండి తన పనితీరును చూడండి'అని.

ఇక్కడ మంత్రుల విషయంలో కూడా ఆయన అదే ఫార్ములాను పాటించారు. తన... అనుకున్న వాళ్లందరికీ ఒక్క అవకాశం ఇచ్చి చూశారు. వాళ్ళ పనితీరు కొలమానంగా వాళ్ళని కొనసాగించాలా లేదా అన్నది 30నెలల తరువాత నిర్ణయిస్తానని చెప్పారు. ఇప్పుడు గెలిచిన వాళ్ళే మళ్ళీ గెలవాలన్నది జగన్‌కి ముఖ్యం కాదు. మళ్ళీ తమ పార్టీ గెలవడమే ఆయనకు ప్రధానం. తమ పార్టీని మళ్ళీ అధికారంలోకి తేవడమే ఆయనకు ముఖ్యం. ఈ విషయంలో ఆయనకు మొహమాటాలుండవు, తన...మన బేధం ఉండదు. ప్రజా సంక్షేమమే ఆయన లక్ష్యం, ప్రజాశ్రేయస్సే ఆయన ధ్యేయం. ఇందుకు మొన్న ఆయన ప్రవేశపెట్టిన బడ్జెట్టే పెద్ద ఉదాహరణ.

ఈ రెండేళ్ల కాలంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులు చాలా తీర్పులు ఇచ్చాయి. కరోనా కారణంగా మూడు రాజధానుల ప్రక్రియ ఆలస్యమయింది. తమకు చేతనైన మేరకు ప్రతిపక్షాలు కుట్రపూరిత ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. అదను చూసి దెబ్బకొట్టడానికి అధికార జాతీయ పార్టీ కాచుకు కూర్చుని ఉంది. అమరావతి ఉద్యమం తెలుగు డైలీ సీరియల్‌లా కొనసాగుతూనే ఉంది. ఆర్థికంగా రాష్ట్రం సంక్షోభ దిశగా పయనిస్తోంది.

ఇవన్నీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లెక్కచేయడంలేదు... తాను అనుకున్న నవరత్నాల పథకాలను ప్రజలకు అందచేస్తోంది. చెప్పిన వాటితో పాటు చెప్పనివి కూడా చేసి చూపిస్తోంది. పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేసింది. వృద్ధ్యాప్య పింఛన్లు, రైతు భరోసా, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆసరా ఇంకా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని పథకాలను జగనన్న పేరుతో వరాల రూపంలో ప్రకటిస్తూనే ఉంది.

రెండేళ్లు గడచినా జగన్ చరిష్మా చెక్కు చెదరలేదు. ఆర్థిక మేధావులకు, రాజకీయ ఉద్దండులకు, సాధ్యా సాధ్యాలను విశ్లేషించే విమర్శకులకు సైతం అంతుపట్టని విధంగా గుండె నిబ్బరంతో, మనోబలంతో ముందుకు పోతున్నారు. రాజశేఖరరెడ్డి వారసుడిగా రాష్ట్రంలో రాజన్న పాలన సాగిస్తున్నారనే అభిప్రాయమే వ్యక్తమవుతున్నది. అన్ని విధాలా ఆయన ప్రభుత్వం పాస్ మార్కులే సాధించింది.

ఇప్పుడు గండం మంత్రులకే. రెండేళ్లు పూర్తయ్యాయి. ఇక ఈ ఆరు నెలలలో వాళ్లకి ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. చివరి ఆరు నెలల పనితీరే కొలమానమా లేక మొత్తం 30 నెలల సమర్థతను పరిగణలోకి తీసుకుంటారా అన్నది టాప్ సీక్రెట్. మరో ఆరు నెలలు వేచి చూడాలి.

# రాజకీయ చట్రంలో.. ఆనందయ్య మందు

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత అన్ని పార్టీల నాయకులపైనా వుంది. అర్థం పర్థం లేని పట్టుదలలకు పోయి ఆనందయ్యను మందు చేయనీయకుండా అడ్డుకోవడం అర్థరహితం. కరోనా కల్లోలం సృష్టిస్తున్న తరుణంలో ఆశాకిరణంలా అవతరించిన ఆనందయ్య మందుని సాధ్యమైనంత ఎక్కువ స్థాయిలో చేయించి ప్రజలకి అందించాల్సిన బాధ్యత ఇప్పుడు ప్రభుత్వంపైనే ఉంది. మందు తయారు చేయడానికి ఆయన వాడే పరికరాలను కొనివ్వడానికి ఇప్పటికే చాలామంది దాతలు ముందుకొచ్చారు. ఇంకా అనేకమంది ఆసక్తి చూపిస్తున్నారు కూడా. ఇది రాజకీయాలకు సమయం కాదు. ఆ పార్టీకి పేరొస్తుందేమోనని ఈ పార్టీ, పలానా నేతకు మైలేజీ వస్తుందేమోనని మరో నేత ఇలా ఎవరికి తోచినట్లుగా వాళ్ళు ఆలోచించుకుని మందు తయారీకి అడ్డు తగులుతున్నారన్న వాదన సర్వత్రా వినిపిస్తోంది. ఇప్పటికైనా అన్ని పార్టీల నాయకులూ మేల్కొని తమ కంపు రాజకీయాలను పక్కన బెట్టి పొలిటికల్ స్టంట్లు మానేసి ప్రజల సెంటిమెంటును గౌరవిస్తే బాగుంటుంది. రాజకీయాలకు అతీతంగా, నేతలు, అధికారులు ఏకాభిప్రాయంతో ఆనందయ్య మందుకి పచ్చ జెండా ఊపకపోతే, కొంతమంది పని కట్టుకుని ప్రచారం చేస్తున్నట్లుగా 'మెడికల్ మాఫియా'కి అమ్ముడుపోయారన్న అపవాదును మూటకట్టుకోవలసి వస్తుంది. చంద్రగిరి శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి కూడా, ప్రభుత్వం నుండి అన్ని అనుమతులూ వచ్చాక టిటిడి ఆధ్వర్యంలో కూడా ఆనందయ్య మందును సరఫరా చేయడానికి సన్నాహాలు చేస్తామని ప్రకటించడం మంచి పరిణామం. అందులోనూ ఆనందయ్య తయారు చేస్తున్న ఆయుర్వేద మందులో ఎలాంటి హానికరమైన పదార్థాలు లేవని ఆయుష్‌శాఖ వారు కూడా ఇటీవల స్పష్టం చేశారు. వేప ఆకులు, నేరేడు చిగుళ్ళు, మారేడు చిగుళ్ళు, తెల్లజిల్లేడు పూల మొగ్గలు, దావరడంగి, పిప్పింటాకు, నేల ఉసిరి, ముళ్ళ వంకాయ గుజ్జు, తోకమిరియాలు, గుంటకలగర, కొండపల్లేరు వంటివన్నీ కూడా ఆయుర్వేదవైద్యంలో ఉన్నవేనని వైద్యనిపుణులు కూడా చెప్తున్నారు. వీటివల్ల ఎలాంటి ప్రమాదం లేదని, ఈ వనమూలికలన్నీ ఆయుర్వేద శాస్త్రల్లో ఉన్నాయని, కొన్ని వేల సంవత్సరాలుగా వీటిని ఆయుర్వేదంలో వాడుతున్నారని, వీటిల్లో కొన్ని రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉగయోగపడతాయని, మరికొన్ని రకరకాల జబ్బులను, వ్యాధులను, రుగ్మతలను తగ్గిస్తాయని ఆయుర్వేద శాస్త్ర గ్రంథాల్లో ఎంతో వివరంగా ఉన్నాయని ఆయుర్వేద వైద్యనిపుణులు గట్టిగా చెప్తున్నారు. కంట్లో చుక్కల మందు వేయడమన్నది కూడా ఆయుర్వేద వైద్యంలో ఉన్నదేనని అంటున్నారు. ఆయుర్వేదం కేవలం ఒక శాస్త్రమే కాక, భారతీయుల జీవన విధానమని, ఆనందయ్య వాడే మందులోని వనమూలికలన్నీ శాస్త్ర ప్రమాణమైనవేనని కూడా ఆయుర్వేద వైద్యనిపుణులు చెప్తుంటే.. ఇక వాటిని వాడుకునేందుకు ఇబ్బంది ఏముంటుంది? ఏదేమైనా ప్రభుత్వాలు ఆనందయ్య మందుకు అన్ని అడ్డంకులూ తొలగేలా చేసి సాధ్యమైనంత త్వరగా, వీలైనంత ఎక్కువమందికి ఆ మందు చేరాలా చూడాలి. మీడియా కూడా పోటీ ధోరణితో అత్యుత్సాహం చూపకుండా ప్రజల మనోభావాలను గౌరవించాలి. నిజంగా అందరూ ఊహించిన స్థాయిలో ఈ మందు సత్ఫలితాలనిస్తే ప్రపంచమే కృష్ణపట్నం వైపుకు పరిగెడుతుంది. ఇచ్చి చూద్దాం... పోయేదేం లేదుగా... మహా అంటే ఆకులు, దినుసులు అంతేగా..!

## వైద్యతాండవం

# అల్లోపతి వైద్యానికి కరోనా



'అల్లోపతిని ఆత్మరక్షణలో పడేసిన ఆనందయ్య' – ఈ హెడ్డింగ్ పెట్టే సాహసం ఏ మీడియా సంస్థ కూడా చేయలేకపోయింది. కానీ, నిజానికి జరిగింది అదే.

దేశం మొత్తం కరోనాతో రోదిస్తున్న సమయం. కార్పొరేట్ హాస్పిటళ్లు ప్రాణాలతోపాటు రక్తమాంసాలను కూడా పీక్కుతినే జలగల్లా మారిన నేపథ్యం. గవర్నమెంట్ హాస్పిటళ్లలో డాక్టర్లు డ్యూటీలో ఉండని పరిస్థితి. ఆక్సిజెన్ సిలిండర్లను గవర్నమెంట్ హాస్పిటల్ సిబ్బంది యథేచ్ఛగా అడ్డదారిలో అమ్ముకుంటున్న సంఘటనలు. నాలుగు రోజుల ట్రీట్‌మెంట్‌కి ఆరు లక్షల బిల్లు వేసిన హాస్పిటల్, మిగిలిన డబ్బు కట్టిన తర్వాతనే శవాన్ని విడుదల చేస్తామని నిస్సిగ్గుగా చెప్పిన దారుణం. ఇన్ని అరాచకాలు జరుగుతుంటే ప్రకృతి ఎక్కడో ఒక చోట అన్నింటినీ సమన్వయం చేస్తుంది. ఆ సమన్వయమే ఆనందయ్య. మన జిల్లాలో ఆనందయ్యతో మొదలైన ఆల్టర్నేటివ్ మెడిసిన్ విప్లవం ఇప్పుడు రోజుకొక జిల్లాలో వెలుగుచూస్తోంది. ఈ ప్రత్యామ్నాయ వైద్యం బతికి బట్ట కడితే ఇక కార్పొరేట్ హాస్పిటల్ మెట్లు ఎక్కే పేషెంట్‌లు ఇప్పట్లో ఉండకపోవచ్చు. ఈ ప్రమాదాన్ని ఊహించిన అల్లోపతి వైద్యరంగం తక్షణమే అప్రమత్తం అయింది. 'ఈ ఆధునిక కాలంలో కూడా ఇలాంటివి నమ్ముతారా' అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. మరొక వైద్య విధానాన్ని పుట్టకముందే చంపేసే ప్రయత్నం ఆధునికత ముసుగులో, అభ్యుదయపు గళంలోనూ వినిపించింది.

### ఆపత్కాల ప్రత్యామ్నాయం!

ఇక పేషెంట్ల దుస్థితిని చూస్తే 'అప్పిచ్చువాడు, వైద్యుడు, నది లేని గ్రామాన్ని, తానెక్కిన వెంటనే నడక మొదలు పెట్టని గుర్రాన్ని తక్షణమే వదిలి పెట్ట'మని సుమతీశతక కారుడు చెప్పిన పద్యం గుర్తుకు వస్తోంది. కార్పొరేట్ వైద్యుడికి ఫీజులు కట్టాలి అప్పివ్వమని అడిగితే తెలిసిన వాళ్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. ఈ పేషెంట్ బతికి బయటకు వచ్చేనా, తమ అప్పు తీర్చేనా అని ఎవరికి వాళ్లు స్నేహహస్తాలను వెనక్కి తీసుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో ఆనందయ్య వైద్యం పేషెంట్‌లకు ఆశాకిరణమైంది. కృష్ణపట్నం ముందు క్యూ కట్టేశారు. ఆనందయ్య కోసం ఎవరూ ప్రచారం చేయలేదు. తనకు తానుగా కూడా ప్రచారం చేసుకోలేదు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన భారత జాతీయోద్యమం దానంతట అదే శక్తి పుంజుకున్నట్లు, దండి సత్యాగ్రహం కోసం ఉద్యమకారులు పాదం కలిపినట్లు ఆనందయ్య వైద్యం కూడా దానంతట అదే శక్తిని పుంజుకుంది. నిజానికి అల్లోపతి వైద్యంలో హరించుకుపోతున్న ప్రాణాలే అందరి దృష్టిని అనందయ్య మీదకు మళ్లించాయి. విదేశీ వస్తు బహిష్కరణ చేసినంత వేగంగా ఉన్న ఫళాన అల్లోపతి వైద్యాన్ని బహిష్కరించడం మొదలుపెట్టారు. ఇంతవరకు ప్రత్యామ్నాయం తెలియక భరించిన బరువును ఒక్కసారిగా దించుకోవడానికి ప్రయత్నించారు. గంట గంటకూ మారిన పరిస్థితులు ఆనందయ్యకు పరీక్షలుగా మారాయి.

> **అల్లోపతి సమాధానం ఏంటి?**
>
> **మన జిల్లాలో ఒక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో కరోనా లేని పేషెంట్‌ని జనరల్ వార్డులో బెడ్ ఖాళీ లేదని కరోనా వార్డులో చేర్చడంతో ఆమెకు కూడా కరోనా సోకి ప్రాణాలు కోల్పోయింది. పేషెంట్ బంధువులు వచ్చి ఇలా ఎందుకు చేశారని డాక్టర్‌ని అడిగితే... ఆ డాక్టర్ కుర్చీలో అత్యంత అభ్యంతరకమైన భంగిమలో కూర్చుని 'దేవుణ్ని అడుగు' అంటూ తన స్మార్ట్ ఫోన్‌లో మునిగిపోయి తల ఎత్తకుండా సమాధానం చెప్పాడు. పేషెంట్‌లు ప్రత్యామ్నాయం వైపు మరలడానికి కారణం అల్లోపతి డాక్టర్లేనంటే కాదనగలమా! ఆనాడు భారతజాతి జాతీయోద్యమంలో ముందడుగు వేసింది మన పాలకులు గొప్ప పరిపాలనను అందిస్తారనే భ్రమతో కాదు, బ్రిటిష్ పాలన పట్ల విముఖతతో మాత్రమే. ఇదీ అంతే. ఆనందయ్య రూపంలో ఓ నిశ్శబ్ద విప్లవం మొదలైంది.**

### పరీక్ష నెగ్గాడు

ఆనందయ్య నిజాయితీగా వైద్యం చేయడం, ఆయన వైద్యం పారదర్శకంగా ఉండడంతో పరీక్షను సులువుగానే నెగ్గాడు. ఆయుష్ కమిషనర్ డాక్టర్ రాములు ఈ మందు హానికరం కాదని మాత్రమే ఆనందయ్యకు క్లీన్‌చిట్ ఇచ్చాడు. మరిన్ని ప్రయోగాల తర్వాత ఈ మందు కరోనాను తగ్గిస్తుందనే నిర్ధారణకు రావచ్చని ఒక ఆశాజనకమైన ప్రకటన చేశారాయన. 'హమ్మయ్య! ఆనందయ్య మరొక రామర్ పిళ్ళై కాలేదు. అంతేచాలు' అని తెలుగు రాష్ట్రాలు ఊపిరి పీల్చుకున్నాయి. అభ్యుదయం ముసుగులో గళం వినిపించే అనైతికవాదులు తప్ప. ఈ కరోనా వైరస్ పుట్టిన చైనా కూడా ఆల్టర్నేటివ్ మెడిసిన్‌తోనే కేసులను నియంత్రణలోకి తెచ్చుకుందనే వాస్తవాన్ని దాచేసే ప్రయత్నం చేస్తూన్న అభ్యుదయవాదం... ఇప్పుడు కార్పొరేట్ వైద్యాన్ని భుజాన మోయడం మొదలు పెట్టింది. ఆనందయ్య తెర మీదకు రాని క్షణం వరకు మనదేశంలో మరణాల సంఖ్యను మాత్రమే చూపిస్తూ విదేశాల్లో మరణాల సంఖ్యతో పోల్చి వైద్యరంగాన్ని, ప్రభుత్వాలను ఆడిపోసుకున్న గొంతుకలు ఇప్పుడు వైద్యరంగం విశేషమైన సేవలందిస్తూ మరణాల శాతాన్ని ఇతర దేశాలకంటే తక్కువగా ఉంచింది... అని వక్కాణిస్తున్నాయి. ఆనందయ్య వైద్యం అల్లోపతితోపాటు అభ్యుదయ వాదాన్ని కూడా ఆత్మరక్షణలో పడేసింది. ఆనందయ్యకు వ్యతిరేకంగా మాట్లాడాలంటే కార్పొరేట్ వైద్యానికి, అల్లోపతి డాక్టర్లకు మద్దతుగా నిలవాలి. అల్లోపతి మంచి సేవలందిస్తోందని చెప్పాలంటే మనదేశంలో సంభవించిన మరణాల సంఖ్యను పలకకుండా శాతాన్ని మాత్రమే మాట్లాడాల్సి వస్తోంది. ఇలా మాట్లాడితే ప్రభుత్వాలను ఆడిపోసుకోవడానికి ఉన్న అవకాశం చేజారిపోతుంది. ఇదీ అసలు సమస్య. ఈ సమస్యకు మందు ఆనందయ్య దగ్గరే కాదు ఏ వైద్యవిధానంలోనూ ఉండదు.

# వైకాపా నేత మృతికి.. ఎమ్మెల్యే ప్రసన్న సంతాపం

కోవూరులోని మసీదువీధికి చెందిన వైకాపా మైనార్టీ నాయకుడు ఎం.డి రియాఉద్దీన్ అనారోగ్యంతో ఈనెల 25న మృతిచెందాడు. రియాఉద్దీన్ మృతి ఎంతో బాధాకరమని, ఆయన ప్రజలతో బాగా కలిసిమెలిసి ఉండేవారని, అలాంటి నాయకుని కోల్పోవడం దురదృష్టకరమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు తమ సంతాపం ప్రకటించారు.

కరోనా కట్టడిలో

# సంచలనం సృష్టిస్తున్న నెల్లూరోళ్ళు



ఒకరిది శాస్త్ర పరిజ్ఞానం

ఇంకొకరిది శాస్త్రీయ విధానం



**కోట్లాదిమందిని నరకయాతనల్లోకి నెడుతూ, లక్షలాదిమంది ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకుంటూ ప్రపంచాన్నే గడగడలాడిస్తున్న కరోనా రాకాసి వ్యాధి ఆట కట్టించేందుకు ఎక్కడా లేనివిధంగా అత్యద్భుతమైన మందులను కనిపెట్టి సంచలనం సృష్టిస్తున్నారు..మన నెల్లూరోళ్ళు. శాస్త్రపరంగా ప్రఖ్యాత శాస్త్రవేత్త..మన జిల్లాలోని ఆత్మకూరు వద్ద ఉన్న మహిమలూరు వాసి, భారత రక్షణ పరిశోధన సంస్థ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి కరోనా ముప్పు నుంచి బాధితులను రక్షించే అత్యద్భుతమైన అత్యంత ఆధునికమైన '2 డీజీ' మందును కనిపెట్టి డిఆర్‌డిఓ ద్వారా ప్రజలకు అందిస్తూ అందరిచేతా ఆపద్బాంధవునిగా పిలవబడుతుంటే, మరోవైపు ముత్తుకూరు పక్కనున్న కృష్ణపట్నం నివాసి మన ఆనందయ్య కరోనాతో కొడిగట్టిపోతున్న ప్రాణాలను కూడా నిలబెడుతూ అందరి ప్రశంసలందుకుంటున్నారు. ప్రజల్ని కబళిస్తున్న కరోనా రాకాసిని తరిమికొడుతూ..నెల్లూరుజిల్లా ముద్దుబిడ్డలైన వీరిద్దరూ నేడు జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగానే కాదు..ప్రపంచవ్యాప్తం చేస్తుండడం జిల్లాకే గర్వకారణం.**

'నెల్లూరోళ్ళంటే చిన్నోళ్ళేమీ కాదు.. పెద్ద సంగతి'.. అనే మాట ఇప్పుడు ఎక్కడ బట్టినా వినబడుతూ ఉంది. కళ్లకు కనిపించకుండా అదృశ్యరూపంలో ఉంటూ జనాల్ని అందినకాడకి నంజుకుతింటున్న కరోనా రాక్షసిని చూసి ప్రపంచమంతా భయపడిపోతూ ఉంది. ఎవరినెప్పుడు ఆ రాకాసి కాజేస్తుందో తెలియదు. మహామహా లాంటివాళ్ళనే గుటుక్కున మింగేసి..ఎవరికీ కనిపించకుండా జనం ప్రాణాలతో ఆటలాడుకుంటూ ఉంది. గాల్లో వైరస్‌లా వస్తున్న ఈ మహమ్మారి వ్యాధి దెబ్బకు రోజూ వేలాదిమంది జనం పిట్టల్లా రాలిపోతుంటే, మిగిలినవాళ్ల ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఎవరిపాటికి వాళ్ళు ఇళ్ళల్లో దాక్కుని బతుకుతున్న పరిస్థితి. మనదేశంలోనే కాదు..ప్రపంచమంతా ఇదే దుస్థితి. ఎవరికి వారు తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలోనంటూ బెంబేలెత్తిపోతూ ఉంటే, నెల్లూరుకు చెందిన సతీష్ రెడ్డి, ఆనందయ్యలు మాత్రం తమ ప్రాణాల సంగతి తర్వాత.. ముందు జనం ప్రాణాలు కాపాడాలంటూ మందు తయారు చేస్తుండడం నెల్లూరీయుల సాహసానికి, ఆయా రంగాల్లో వారి ప్రజ్ఞాపాటవాలకి నిలువెత్తు నిదర్శనం. కరోనా నివారణకు మందు కనిపెట్టడంలో ఈ ఇద్దరు చేస్తున్న కృషికి సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## కరోనా బాధితులకు దివ్యౌషధం.. 2 డీజీ :

కరోనా బారిన పడిన బాధితుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటుంది. కరోనా వచ్చిందంటే చాలు.. ఇక వారిని ఇంట్లోవాళ్ళు, బయటివాళ్ళు వెలివేసినట్లుగా చూస్తున్న రోజులివి. ఆసుపత్రికి వెళ్ళాలన్నా భయమే. ఊపిరితిత్తుల్ని దెబ్బతీసి ప్రాణాలను హరించే కరోనా వ్యాధిని ఎలా నియంత్రించాలో తెలియక ప్రజలు వణికిపోతున్నారు. కరోనా వస్తే.. చావు దగ్గరికొచ్చినట్లేనని అంతా భయపడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కరోనా బాధితులకు నేనున్నానంటూ డిఆర్‌డిఓ ఛైర్మెన్.. మన సతీష్‌రెడ్డి సారధ్యంలో కరోనా రాకాసిని నియంత్రించేందుకు బ్రహ్మాస్త్రం లాంటి మందు సిద్ధమైంది. దానిపేరే '2–డీజీ' పొడిమందు. కరోనా బాధితులు వీలైనంత త్వరగానే కోలుకునేందుకు ఈ మందు బాగా పనిచేస్తుంది. అంతేకాదు, ఈ మందు వాడుకుంటే ఇక ఆక్సిజన్ కూడా అవసరం ఉండదు. ఇటీవలే తొలివిడతగా ఈ మందును ఢిల్లీలో ఆవిష్కరించారు. విశాఖలోని కెజిహెచ్‌లో కోవిడ్‌తో చికిత్సపొందుతున్న 13 మంది బాధితులకు ఈ మందు ఇచ్చి చూశారు. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు లేవని, కోవిడ్ రోగులు ఈ మందు తీసుకున్న తర్వాత అయిదురోజులకు కోవిడ్ పోయినట్లుగా నెగటివ్ వచ్చిందని వైద్యనిపుణులు స్పష్టం చేశారు. డిఆర్‌డిఓ తయారుచేసిన మందులు కొనుగోలు చేసి ప్రజలకు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అధికారులను ఆదేశించడంతో 2–డీజీ మందుల కొనుగోళ్ళకు రంగం సిద్ధమైపోయింది కూడా. ఇక త్వరలోనే రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులకి, ప్రజలకి ఈ పొడిమందు అందుబాటులోకి వచ్చేస్తుంది కూడా.

## అనందయ్య మందు.. అమృతమే :

కరోనా రాకుండా, ఒకవేళ వచ్చినా ప్రాణాపాయం లేకుండా, చివరికి ప్రాణం మీదికొచ్చి చివరిదశలో వచ్చినా సరే.. వారి ప్రాణాలు పోకుండా కాపాడే అత్యద్భుతమైన మందు..ఆనందయ్య మందు. ఈ ఆయుర్వేద మందును అనేకరకాల వనమూలికలతో తయారుచేసి.. ఇప్పటికే చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వేలాదిమంది కరోనా బాధితులకు..తిరిగి ప్రాణం పోసిన కృష్ణపట్నం ఆనందయ్య మందు.. బాధితలకు ఒక గొప్ప వరం. ప్రజలందరికీ ఇది దివ్యౌషధం. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇదొక అమృతం. ఎంతోమంది ఈ మందును వాడారు.. కరోనా నుంచి బయటపడ్డారు. ఇంతకన్నా కావాల్సిందేముంది?.. ఎంతోమంది ప్రత్యక్షంగా ఈ వింతను చూస్తూనే ఉన్నారు. చావబోయేవారు లేచి కూర్చుంటున్నారు. ఇంతకన్నా ఇంకా.. ఏం రుజువులు కావాలీ?... అందులోనూ ఆ మందు ఉచితం కూడా. ఈ కరోనా కాలంలో డబ్బాశ లేకుండా మందులిచ్చేవారెవరైనా ఉన్నారా?.. ఇంతకన్నా అద్భుతం ఇంకెక్కడుంటుందీ?...అందువల్లనే ప్రజలంతా ఆనందయ్య మందు కావాలని పెద్దపెట్టున కోరుకుంటున్నారు. ఈ మందు తీసుకుంటే కరోనా భయం ఇక ఉండదనే సెంటిమెంటుతో ఆనందయ్య అప్పాయింట్‌మెంట్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కరోనా రాకాసి వచ్చి అందరినీ నిలువునా చంపుతుంటే, ఆనందయ్య ఆయుర్వేద మందు కరోనాని తరిమికొడుతూ, కొనఊపిరితో ఉన్న వాళ్ళ ప్రాణాలను కూడా నిలబెడుతుండడం చూసిన జనం అవాక్కయిపోతున్నారు. ఇది కలా నిజమా? అని వళ్లు గిల్లుకుని మరీ చూసుకుంటున్నారు. నిజమే!..ఈ మందు ఒక అద్భుతం.. అమోఘం!..అని నిర్ధారించుకున్నారు. క్షణాల్లో ఈ విషయం దేశమంతా పాకిపోయింది. కరోనాతో ఊపిరాడక చావబోయే వాళ్ళను కూడా బతికిస్తున్న మందును కనిపెట్టిన ఆనందయ్యను ప్రజలంతా అభినందిస్తూ..'ఆనందయ్యా.. నీ మందు అమృతమయ్యా' అంటూ కొనియాడుతుండడం విశేషం. చూడండి!..మన ప్రాచీనమైన ఆయుర్వేద వైద్యం ఎంత గొప్పదో!.. ప్రస్తుతానికి ఇప్పుడు ఆ మందు ప్రభావం ఇంకా ఎలా ఉంటుందోనని ఢిల్లీస్థాయిలో పరిశోధనలు జరుగుతున్న నేపథ్యంలో.. అన్నీ అనుకూలిస్తే.. ఇక రేపోమాపో ఆనందయ్య మందు మళ్ళీ ప్రజల్లోకి వచ్చేస్తుందని అందరూ ఎదురుచూస్తున్నారు. ఆనందయ్య మందులో ఎలాంటి కీడు చేసే పదార్థాలు లేవని, అన్నీ ప్రకృతిలో లభించే ఆకులు, వనమూలికలేనని, వీటివల్ల ఎలాంటి ప్రమాదం లేదని వైద్య నిపుణులు కూడా చెప్తున్నారు.

ముందు 'ఆనందయ్య మందు మాకిచ్చెయ్యండయ్యా'.. అంటూ వేల సంఖ్యలో ప్రజలు కృష్ణపట్నం రోడ్లమీద క్యూ కడుతున్నారంటే అతిశయోక్తి ఏముందీ?... ప్రాచీన కాలం నుంచి మన భారతదేశంలో ఉన్నది అందరికీ ఒకటే మందు.. అదే ఆయుర్వేద మందు. ముందుతరాల ప్రజలందరినీ బతికించింది అదే. అందుకే, ఇప్పుడు ఆనందయ్య మందు వస్తే.. కరోనాకి భయపడాల్సిన అవసరంలేదన్నది జిల్లాప్రజల గట్టి నమ్మకం.

ఏదేమైనా, ప్రపంచాన్నంతా భయపెడుతున్న కరోనా రాకాసిని తరిమికొట్టేందుకు మన నెల్లూరోళ్ళు ఇద్దరూ అటు శాస్త్రపరంగా, ఇటు శాస్త్రీయంగా కూడా ఇంత అద్భుతమైన మందులు కనిపెట్టడమంటే చిన్నసంగతేమీ కాదు. ఈ కరోనా నుంచి ప్రజలను మృత్యుగండం నుంచి రక్షించడానికి పుట్టిన అపురూపమైన వ్యక్తులుగా.. కారణజన్ములుగా.. వీళ్ళిద్దరూ చరిత్రలో నిలబడిపోతారు. నిజంగానే.. నెల్లూరోళ్ళంటే.. చిన్నోళ్ళేమీ కాదు..పెద్ద సంగతి'.. అంటూ నిరూపిస్తున్న ఇద్దరికీ 'లాయర్' అభినందనలు!. **హ్యాట్సాఫ్ టు సతీష్‌రెడ్డి మరియు ఆనందయ్య !..**




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com